# తొలివెలుగు
జాతీయ దినపత్రిక

మన భాష.. మన పత్రిక..

https://tholivelugu.com/

హైదరాబాద్ | సంపుటి: 01 | సంచిక : 183 | ఆదివారం | 19-7-2026








PUBLISHED FROM : HYDERABAD,KARIMNAGAR, WARANGAL, NALGONDA, KHAMMAM, MAHABOOBNAGAR, NIZAMABAD

వెల: రూ.5/- పేజీలు: 08


## ఫిఫా వరల్డ్ కప్ ఫైనల్ సందర్భంగా తెలంగాణ సర్కార్ కీలక నిర్ణయం

ఫిఫా వరల్డ్ కప్ ఫైనల్ సందర్భంగా హైదరాబాద్‌లో బార్ల వేళల పొడిగింపు

- ఫైనల్ మ్యాచ్ రోజు తెల్లవారుజాము 3 గంటల వరకు మద్యం సరఫరాకు అనుమతి
- మూడో స్థానం మ్యాచ్ కోసం తెల్లవారుజాము 4:30 గంటల వరకు పర్మిషన్
- ఫుట్‌బాల్ అభిమానుల విజ్ఞప్తి మేరకు తెలంగాణ ప్రభుత్వ నిర్ణయం
- బార్ అండ్ రెస్టారెంట్స్ ఓనర్స్ అసోసియేషన్ అభ్యర్థనకు ఆమోదం




2లో



## రష్యాపై ఉక్రెయిన్ భీకర దాడులు

9 మంది మృతి, 60 మందికి పైగా గాయాలు

## బెంగాల్‌లోనూ బుల్‌డోజర్ న్యాయం

టీఎంసీ కార్యాలయం కూల్చివేత

నిబంధనలకు విరుద్ధంగా నిర్మించారంటున్న అధికారులు

2లో



## 2024లో రాజకీయ చెత్తను
# ప్రజలే శుభ్రం చేశారు

- రాష్ట్రవ్యాప్తంగా రూ.15,274 కోట్ల పట్టణాభివృద్ధి పనులకు గుడివాడ నుంచి శ్రీకారం
- బూతులు తిట్టిన వారి నోళ్లను ప్రజలు తమ ఓట్లతో కడిగేశారన్న చంద్రబాబు
- అక్టోబర్ 2 నాటికి ఏపీని చెత్త రహిత రాష్ట్రంగా తీర్చిదిద్దుతామని ప్రకటన
- భావ ప్రకటనా స్వేచ్ఛ పేరుతో అసభ్య పోస్టులను సహించేది లేదని హెచ్చరిక
- ఈ నెల 22 నుంచి "తల్లికి వందనం" కింద తల్లుల ఖాతాల్లో నిధులు జమ



పరిశుభ్రమైన, సంపన్నమైన ఆంధ్రప్రదేశ్ నిర్మాణమే లక్ష్యంగా స్వచ్ఛాంధ్ర-స్వర్ణాంధ్ర కార్యక్రమాన్ని అమలు చేస్తున్నామని, 2024 ఎన్నికల్లో రాష్ట్రంలోని రాజకీయ చెత్తను ప్రజలే శుభ్రం చేశారని ముఖ్యమంత్రి చంద్రబాబు అన్నారు. బూతులు తిట్టిన వారి నోళ్లను ప్రజలు తమ ఓట్లతో కడిగేశారని ఘాటుగా వ్యాఖ్యానించారు. కృష్ణా జిల్లా గుడివాడలో శనివారం జరిగిన 18వ స్వచ్ఛాంధ్ర-స్వర్ణాంధ్ర కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా రాష్ట్రంలోని 120 పట్టణ స్థానిక సంస్థల పరిధిలో రూ.15,274 కోట్ల విలువైన ప్రజారోగ్య, మున్సిపల్ ఇంజినీరింగ్ పనులకు ఆయన శంకుస్థాపనలు చేశారు. అక్టోబర్ 2వ తేదీ నాటికి రాష్ట్రాన్ని కాలుష్య రహిత, చెత్త రహిత ప్రాంతంగా తీర్చిదిద్దడమే తమ ప్రభుత్వ లక్ష్యమని స్పష్టం చేశారు. దివంగత ఎన్టీఆర్ తొలిసారి ప్రజాక్షేత్రంలో నిలిచిన గుడివాడ నుంచే స్వచ్ఛ రాజకీయాలకు పునాది పడిందని చంద్రబాబు గుర్తుచేశారు. స్వచ్ఛమైన రాజకీయాలు, స్వచ్ఛమైన ప్రజాప్రతినిధులు,



## గద్దర్, అందెశ్రీలతో పెట్టుకున్న వాళ్లు
# మట్టిలో కలిసిపోయారు

- మీరు పదేళ్లలో నోటిఫికేషన్లు వేయడం తప్ప ఉద్యోగాలు భర్తీ చేయలేదు
- తెలంగాణ తులసి వనంలో గంజాయి మొక్క మొలకెత్తనివ్వం
- అందెశ్రీ పాటను వినిపించకుండా కుట్రలు చేశారు
- మీకు గతమే.. భవిష్యత్తు లేదు.. బీఆర్ఎస్‌పై సీఎం రేవంత్‌రెడ్డి ఫైర్
- అందెశ్రీ తనకు ఆత్మబంధువని, తమ ప్రభుత్వం ఆయన స్ఫూర్తితో పనిచేస్తోందని వెల్లడి
- అందెశ్రీ స్మృతివనం భూమి పూజలో ముఖ్యమంత్రి

2లో



## కొనసాగిన దాడుల పర్వం

- వరుసగా ఏడోరోజూ ఇరాన్‌పై రాత్రి దాడులతో రెచ్చిపోయిన అమెరికా
- 7 రోజుల్లో ఇరాన్‌లో 50 మంది దుర్మరణం
- దక్షిణ ఇరాన్‌లో డీసాలినేషన్ ప్లాంట్‌పై అమెరికా దాడి
- ప్రతిగా అమెరికా మిత్రదేశాలపై ఇరాన్ దాడులు
- ఇరాన్ దాడుల్లో ధ్వంసమైన కువైట్ విద్యుత్ ఉత్పత్తి, డీసాలినేషన్ ప్లాంట్లు

దుబాయ్: ఇరాన్‌తో తాత్కాలిక శాంతి ఒప్పందం నుంచి తప్పుకుంటున్నట్లు ట్రంప్ ప్రకటించిన మరుసటి రోజు నుంచి వరుసగా ఏడోరోజూ ఇరాన్‌పై అమెరికా సేనలు రాత్రిపూట దాడులను శనివారమూ కొనసాగించాయి. దీంతో ఇరాన్‌వ్యాప్తంగా అమెరికా దాడుల్లో గత ఏడు రోజుల్లో చనిపోయిన

## హైదరాబాదులో పవన్ కల్యాణ్‌ను పరామర్శించిన నారా లోకేశ్

- గతంలో పవన్ భుజానికి గాయం
- ఇటీవల ముంబైలో విజయవంతంగా శస్త్రచికిత్స
- కొన్ని రోజుల కిందటే ఆసుపత్రి నుంచి డిశ్చార్జి
- హైదరాబాదులోని నివాసంలో విశ్రాంతి తీసుకుంటున్న వైనం
- పవనన్న త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించిన లోకేశ్

2లో





## వాంగ్‌చుక్ దీక్ష భగ్నం!

- జంతర్‌మంతర్ నుంచి బలవంతంగా ఆసుపత్రికి తరలించిన పోలీసులు
- వేదిక చుట్టూ తెల్ల దుప్పట్లు అడ్డంగా పెట్టి అంబులెన్స్‌లోకి
- ఢిల్లీ హైకోర్టు ఆదేశాల మేరకు చర్యలు తీసుకున్నట్లు వెల్లడి
- ఆసుపత్రిలో చికిత్సకు నిరాకరిస్తున్న వాంగ్‌చుక్
- ప్రభుత్వ చర్యను తీవ్రంగా ఖండించిన విపక్ష నేతలు
- నిరాహార దీక్ష ప్రారంభించిన సీజేపీ వ్యవస్థాపకుడు అభిజిత్ దీప్కే

న్యూఢిల్లీ: సామాజిక ఉద్యమకారుడు, పర్యా వరణవేత్త సోనమ్ వాంగ్‌చుక్ నిరవధిక నిరాహార దీక్షను ఢిల్లీ పోలీసులు భగ్నం చేశారు. నీట్--యూజీ ప్రశ్నపత్రం లీకేజీ వ్యవహారంలో దోషులను కఠినంగా శిక్షించాలని, కేంద్ర విద్యా శాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా చే యాలన్న డిమాండ్‌తో దేశ రాజధాని

## ఉద్యోగాలు అడిగితే ఎండ్రిన్ తాగి చావమంటున్నాడు

- కాంగ్రెస్ యూత్ డిక్లరేషన్ పెద్ద మోసం.. యువత జంగ్ సైరన్ మోగించింది.. ఇప్పటివరకు ఒక లెక్క.. ఇకపై మరో లెక్క..
- 2028లో వచ్చేది బీఆర్ఎస్ ప్రభుత్వమే.. కేసీఆరే సీఎం
- సరూర్‌నగర్ యువ సంగ్రామ సదస్సులో గులాబీ నేత

2లో



## బెంగాల్‌లోనూ బుల్‌డోజర్ న్యాయం

కోల్‌కతా: బీజేపీ అధికార పగ్గాలు చేపట్టిన బెంగాల్‌లోనూ బుల్‌డోజర్ న్యాయం అమలవుతోంది. దక్షిణ 24 పరగణాల జిల్లా అమ్తాల్‌లో ఉన్న ఎంపీ అభిషేక్ బెనర్జీకి చెందిన టీఎంసీ కార్యాలయాన్ని అధికారులు శనివారం కూల్చివేశారు. ఉదయం అమ్తాల్ ప్రాంతాన్ని పోలీసులు, కేంద్ర బలగాలు దిగ్బంధించాయి. మధ్యాహ్నం వేళ అక్కడికి చేరుకున్న మూడు బుల్‌డోజర్లతో కార్యాలయం ముందున్న షెడ్‌ను, భవనం ముందు భాగాన్ని నేలమట్టం చేశాయి. భవన నిర్మాణానికి సంబంధించి ఎలాంటి అనుమతులు లేకుండా, నిబంధనలకు విరుద్ధంగా నిర్మించారని జిల్లా అధికారులు తెలిపారు. భవనాన్ని అక్రమంగా నిర్మించారంటూ అందిన ఫిర్యాదుల మేరకు ఈ నెల 15వ తేదీన సంబందీకులకు నోటీసులు జారీ చేసినా ఎలాంటి స్పందన లేదన్నారు. భవన యాజమాని, నిర్మాణ వివరాలు కావాలని అడిగినా సమాధానం ఇవ్వలేదని తెలిపారు. అందుకే, చట్ట ప్రకారం, నిబంధనల మేరకు కూల్చివేతలు చేపట్టినట్లు వివరించారు. కాగా, ఆ సమయంలో పెద్ద సంఖ్యలో అక్కడికి చేరుకున్న బీజేపీ కార్యకర్తలు తమ ప్రభుత్వానికి అనుకూలంగా నినాదాలు చేశారు. కూల్చివేత సమయంలో భవనంలో ఉన్న కంప్యూటర్లు, ల్యాప్‌టాప్‌లు, పెద్ద సంఖ్యలో ఫైళ్లను అధికారులు స్వాధీనం చేసుకున్నారు. అభిషేక్ డైమండ్ హార్బర్ ఎంపీ కాగా, అమ్తాలా ఆ నియోజకవర్గంలో ఒక భాగం. టీఎంసీ పార్టీ కార్యాలయం నడుస్తున్న ఈ భవనం లీప్స్ అండ్ బౌండ్ అనే కంపెనీ పేరుతో కొనుగోలు చేసినట్లు రికార్డుల్లోఉందని అధికారులు తెలిపారు. అమ్తాలాలోని టీఎంసీ కార్యాలయ భవనమున్న స్థలాన్ని తాము కొనుగోలు చేసిన చోటే అన్ని అనుమతులు పొందాకే నిర్మించినట్లు ఎంపీ అభిషేక్ బెనర్జీ చెప్పారు. బీజేపీ ప్రభుత్వం మాత్రం ఉద్దేశపూర్వకంగానే కూల్చివేతలు చేపట్టిందన్నారు. ప్రైవేట్ వ్యక్తుల నుంచి కొనుగోలు చేసిన భూమిలోనే భవనాన్ని కట్టామని చెప్పారు. దీనిపై కలకత్తా హైకోర్టులో అన్ని ఆధారాలతో పిటిషన్ వేస్తామని, సత్వరమే విచారణ చేపట్టాలని కోరుతామన్నారు. భవనాన్ని బుల్‌డోజర్లతో ధ్వంసం చేస్తుండగా బీజేపీ కార్యకర్తలు కూడా అందులో పాలుపంచుకోవడం, ఆ ప్రాంతంలో కూల్చివేతలను పర్యవేక్షించిన అధికారులు, సిబ్బందికి సంబంధించిన మొత్తం వీడియో తమ వద్ద ఉందన్నారు. ఈ అంశంపై సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి ఆఫీసర్ ఆన్ స్పెషల్ డ్యూటీ(ఓఎస్‌డీ)కి కూడా ఫిర్యాదు చేస్తామని వివరించారు.

## కొనసాగిన దాడుల పర్వం

ఇరానియన్ల సంఖ్య 50కి పెరిగిందని ఆ దేశ ఆరోగ్యమంత్రిత్వశాఖ శనివారం ప్రకటించింది. జూన్ 27 తర్వాత అమెరికా మొదలెట్టిన భీకర దాడుల్లో ఇప్పటిదాకా 500 మందికిపైగా గాయపడ్డారు. శనివారం సైతం ఇరాన్‌లోని మౌలిక వసతులు, సైనిక లక్ష్యాలపై అమెరికా పదులకొద్దీ ఆత్మాహుతి డ్రోన్లు, క్షిపణులతో విరుచుకుపడి భారీ స్థాయిలో విధ్వంసం సృష్టించింది. నిఘా ప్రాంతాలు, సాయుధ ఉపకరణాలు, రహదారులు, వంతెనలు, భూగర్భ ఆయుధాగారాలు, నావికాదళ సామర్థ్యాలను నాశనంచేశామని శనివారం ఉదయం అమెరికా సెంట్రల్ కమాండ్ ప్రకటించింది. అమెరికా దాడిలో దక్షిణ ఇరాన్‌లోని డీసాలినేషన్ ప్లాంట్ ధ్వంసమైంది.దీంతో ఈ ప్లాంట్ నుంచి 20 గ్రామాలకు తాగునీటి సరఫరా పూర్తిగా నిలిచిపోయింది. దీంతో జనం అల్లాడిపోయారని హార్మ్యూజన్ ప్రావిన్స్ డెప్యూటీ గవర్నర్ ఇస్లాయిల్ దెహస్తానీ ఆగ్రహం వ్యక్తంచేశారు. దాడులకు ఇరాన్ దీటుగా బదులిచ్చింది. అమెరికా పేట్రేగిపోతున్నా మౌనం దాల్చిన దాని మిత్రదేశాలపై ఇరాన్ క్షిపణులకు పనిజెప్పింది. దీంతో కువైట్‌లోని నీటి శుద్ధికరణ(డీసాలిలేషన్)ప్లాంట్, విద్యుత్‌ఉత్పత్తి కేంద్రాలు పేలుళ్లతో మార్మోగిపోయాయి. చమురుశుద్ధి కర్మాగారంపై దాడిలో పలువురు కువైట్ సిబ్బంది గాయాలపాలయ్యారు. దాడులతో పల విద్యుత్ ఉత్పత్తి కర్మాగారాల్లో ఉత్పత్తిని వెంటనే నిలిపేశారు. కువైట్‌లోని డీసాలినేషన్ ప్లాంట్‌లపై ఇరాన్ దాడిచేయడం వరుసగా ఇది రెండోరోజు. కువైట్ తన తాగునీటి అవసరాల కోసం 90 శాతం డీసాలినేషన్ ప్లాంట్‌ల మీదనే ఆధారపడుతోంది. ఇరాన్ దాడుల కారణంగా మంటల్లో చిక్కుకున్న ప్రాంతాల్లో సహాయక కార్యక్రమాల్లో పాల్గొన్న పలువురు అగ్నిమాపక సిబ్బంది,కారి?మకులు గాయపడ్డారని కువైట్ ఫైర్ ఫోర్స్ తెలిపింది.

## హైదరాబాదులో పవన్ కల్యాణ్ ను పరామర్శించిన నారా లోకేశ్

ఆంధ్రప్రదేశ్ డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్‌ను రాష్ట్ర ఐటీ, విద్యాశాఖ మంత్రి నారా లోకేశ్ శనివారం పరామర్శించారు. ఇటీవల ముంబయిలో భుజానికి శస్త్రచికిత్స చేయించుకుని హైదరాబాద్‌లోని తన నివాసంలో విశ్రాంతి తీసుకుంటున్న పవన్ కల్యాణ్‌ను లోకేశ్ మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా "పవనన్న త్వరగా కోలుకోవాలి" అని ఆయన ఆకాంక్షించారు. పవన్ కల్యాణ్ ఆరోగ్య పరిస్థితిని లోకేశ్ అడిగి తెలుసుకున్నారు. భుజానికి అయిన గాయం, జరిగిన శస్త్రచికిత్స వివరాలను అడిగారు. వైద్యుల సూచనల మేరకు పూర్తి విశ్రాంతి తీసుకోవాలని సూచించారు. తన పరామర్శ అనంతరం లోకేశ్ మాట్లాడుతూ.. "డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ గారిని పరామర్శించాను. ఆయన త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించాను. వైద్యుల సూచనలు పాటిస్తూ వీలైనంత మేర విశ్రాంతి తీసుకోవాలని సూచించాను" అని తెలిపారు. గతంలో భుజానికి గాయం కావడంతో పవన్ కల్యాణ్ కొంతకాలంగా ఇబ్బంది పడుతున్న సంగతి తెలిసిందే. ఇటీవలే ముంబయిలోని కోకిలాబెన్ ఆసుపత్రిలో ఆయన కుడి భుజానికి వైద్యులు విజయవంతంగా శస్త్రచికిత్స చేశారు. ఆసుపత్రి నుంచి డిశ్చార్జ్ అయిన తర్వాత ఆయన హైదరాబాద్‌లోనే ఉంటూ విశ్రాంతి తీసుకుంటున్నారు. పలువురు ప్రముఖులు ఆయన నివాసానికి వచ్చి పరామర్శిస్తున్నారు.

## రష్యాపై ఉక్రెయిన్ భీకర దాడులు

మాస్కో: ఉక్రెయిన్ తన లాంగ్ రేంజ్ డ్రోన్ల సత్తాను రష్యాకు రుచి చూపింది. శుక్రవారం రాత్రి రాజధాని మాస్కో తదితర ప్రాంతాలపై ఉక్రెయిన్ జరిపిన దాడుల్లో 9 మంది చనిపోగా, 60 మందికి పైగా గాయపడ్డారు. ఇంధన, సైనిక లక్ష్యాలపై జరిగిన ఈ దాడుల్లో పలు చోట్ల అగ్ని ప్రమాదాలు చోటుచేసుకున్నాయి. టాంబోవ్ ప్రాంతంలోని కొటొవ్స్క్ , మాస్కోకు 50 కిలోమీటర్ల దూరంలో ఉన్న ఎలక్ట్రోస్టాల్ నగరంలోని గోదాములు మంటల్లో చిక్కుకున్నాయి. ఈ రెండూ ప్రముఖ ఆన్‌లైన్ రిటైలర్ వైల్డ్‌బెర్రీస్‌కు చెందినవని అధికారులు తెలిపారు. కొటొవ్స్క్ ఘటనలో ఏడుగురు చనిపోగా, 25 మంది గాయపడ్డారు. మాస్కో ప్రాంతంలో జరిగిన దాడుల్లో ఒకరు చనిపోగా, 37 మంది గాయపడినట్లు గవర్నర్ తెలిపారు. ఎలక్ట్రోస్టాల్‌లోని గోదాములో దాడితో ఒకరు చనిపోయారు. ఇక్కడ ప్రమాద తీవ్రత కారణంగా పొరుగునే ఉన్న ఒక నివాస భవనాన్ని, ఆస్పత్రిని అధికారులు ఖాళీ చేయించారు. ఈ రెండు గోదాముల్లోనూ డ్రోన్ల తయారీకి సంబంధించిన నిషేధిత సామగ్రి ఉందని ఉక్రెయిన్ అధ్యక్షుడు జెలెన్‌స్కీ చెప్పారు.

# గద్దర్, అందెశ్రీలతో పెట్టుకున్న వాళ్లు మట్టిలో కలిసిపోయారు

ఘట్‌కేసర్: తన పాట కోట్లాది తెలంగాణ ప్రజల కోసం తప్ప, గడీల దొరల కోసం కాదని ప్రత్యేక తెలంగాణ ఉద్యమ రథసార్యథి, ప్రజా కవి డాక్టర్ అందెశ్రీ నిటారుగా నిలబడ్డారని సీఎం రేవంత్‌రెడ్డి చెప్పారు. మనందరం దండు కట్టి విషసర్పాలను తుదముట్టించాలన్న ఆయన మాటలు గుర్తుకొస్తున్నాయన్నారు. గత పదేళ్ల పాలనలో ఆయన పాట వినిపించకుండా కుట్రలు చేశారని, పెన్నులపై మన్ను కప్పితే గన్నులై మొలకెత్తుతాయని రేవంత్ పేర్కొన్నారు. అందెశ్రీ 65 జయంతిని పురస్కరించుకొని మేడ్చల్ జిల్లా ఘట్‌కేసర్ మున్సిపాలిటీ ఓఆర్ఆర్ వద్ద అందెశ్రీ స్మృతివనం పనులకు శనివారం ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్కతో కలిసి రేవంత్ భూమి పూజ చేసి పునాది రాయి వేశారు.దఅనంతరం జరిగిన సమావేశంలో రేవంత్‌రెడ్డి మాట్లాడారు. 'మేం నోటిఫికేషన్లు ఇచ్చినం, రేవంత్‌రెడ్డి భర్తీ చేశారని సిస్సిగ్గుగా మాట్లాడుతున్నారు. పేపర్ లీకేజీలతో వందల కోట్లు సంపాదించావు కానీ ఉద్యోగాల కోసం ఏనాడు ఆలోచించలేదు. మీరు నిరుద్యోగులను ఏనాడూ మానవీయ కోణంలో చూడలేదు. మేం అధికారంలోకి వచ్చాక అడ్డంకులు తొలగించి ఉద్యోగాలు భర్తీ చేశాం. పదేళ్లలో నోటిఫికేషన్లు వేయడం తప్ప ఉద్యోగాలు ఎందుకు భర్తీ చేయలేదు. ఏడాదిలో మేం 79 వేల ఉద్యోగాలను భర్తీ చేశాం. ఎల్బీస్టేడియం, శిల్పాకళా వేదికగా తల్లితండ్రుల ముందు వారి బిడ్డలకు ఉద్యోగ నియామక పత్రాలు అందించి వారి కళ్లల్లో ఆనందం నింపాం' అని రేవంత్‌రెడ్డి అన్నారు. 'ఎప్పుడైతే అందెశ్రీ గళాన్ని బంధించాలనుకున్నారో, గద్దరన్నను అవమానించారో అనాడే గడీల పాలనకు శాశ్వతంగా పాతరేయాలని ప్రజలు నిర్ణయించుకున్నారు. మేక తోలు కప్పుకున్న తోడేలు ఇవాళ మాట్లాడుతోంది. ఇవాళ తోడేళ్ల గుంపును ప్రశ్నిస్తున్నా.. ఆనాడు కవితను, వినోద్‌రావును ప్రజలు తిరస్కరిస్తే ఆద్యోగాలిచ్చినవు, తెలంగాణ బిడ్డల ఉద్యోగాల కోసం ఒక్కనాడైనా ఆలోచించావా. మీరు శ్రీమంతులు ఎలా అయ్యారు, తెలంగాణ ఎందుకు అప్పుల పాలైందో చెప్పండి. గజ్వేల్‌లో మిమ్మల్ని మా యువత రాజకీయ సమాధి చేస్తుంది' అని రేవంత్ అన్నారు. ప్రజా ప్రభుత్వం ఎందుకు పోవాలి, మీ కుటుంబం దోచుకోవడానికా, కుటుంబ పదవుల కోసమా అని ప్రశ్నించారు. 2034 వరకు ప్రజా ప్రభుత్వమే ఉంటుందని, ఇదే భవిషత్తు, ఇదే చరిత్ర,. మీకు గతమే తప్ప భవిష్యత్తు లేదన్నారు. 'తెలంగాణ సమాజం మీకు ఏం తక్కువ చేసింది.. దుబాయ్ పాస్‌పోర్ట్ బ్రోకర్‌ను ముఖ్యమంత్రిని చేసింది. అమెరికాలో బాత్రూంలు కడిగినోడిని, రబ్బరు చెప్పులేసుకొని తిరిగి, సోడా పోసినోళ్లను మంత్రులను చేసింది. నేను ఉన్నంత కాలం తెలంగాణ తెలసి వనంలో గంజాయి మొక్కను మొలకెత్తనివ్వను. మాకు అందెశ్రీ, గద్దర్, సోనియా గాంధీ స్ఫూర్తి, మీకు నిజాం, ఖాసిం రిజ్వీ స్ఫూర్తి. నీకు, మాకు పోలికేంటి. మీ దోపిడీని ప్రజలు ఇంకా మరిచిపోలేదు. తెలంగాణ సమాజం గమనిస్తోంది. నిజాంను దిగంతాలకు తరిమిన చరిత్ర ఈ గడ్డకు ఉంది. తెలంగాణ ప్రజల చైతన్యం ముందు మీరెంత. తెలంగాణ సమాజం మిమ్మల్ని క్షమించదు' అని సీఎం రేవంత్‌రెడ్డి చెప్పారు. తెలంగాణను ఎవరూ చెరబట్టలేరని, చెరబట్టాలని చూస్తే అందెశ్రీ పాటగా తిరిగొస్తారన్నారు. తమ ప్రభుత్వం ఆయన స్ఫూర్తితో పని చేస్తోందన్నారు. నిరుద్యోగులు మాయగాళ్ల మాయలో పడొద్దని, తమ ప్రభుత్వం ఉద్యోగ ఖాళీలను భర్తీ చేస్తుందని చెప్పారు. శ్రీకాంతాచారి తల్లి శంకరమ్మను, చాకలి ఐలమ్మ మనుమరాలిని మహిళా కమిషన్ సభ్యులుగా, ప్రొఫెసర్ కోదండారాంను ఎమ్మెల్సీగా నియమించామన్నారు. 9 మంది కవులను సన్మానించి కోటి రూపాయల నగదు బహుమతిచ్చి గౌరవించామన్నారు. ఈ కార్యక్రమంలో మంత్రులు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, మాజీ ప్రజా ప్రతినిధులు పాల్గొన్నారు.

**కుటుంబపెద్దగా భావించా..**

అందెశ్రీ ఆత్మగౌరంతో ఏనాడూ దొరల గడప తొక్కలేదని సీఎం రేవంత్‌రెడ్డి చెప్పారు. ప్రస్తుతం తెలంగాణలో ప్రతి బడి, గడపలో ఆయన పాట వినిపిస్తోందన్నారు. అందెశ్రీకి ప్రజా ప్రభుత్వం అపూర్వ గౌరవం ఇచ్చిందని రేవంత్‌రెడ్డి చెప్పారు. 'అందె శ్రీ నాకు ఆత్మబంధువు.., కుటుంబ పెద్దగా భావించాను. నిరాశ, నిస్పృలకు లోనైనప్పుడు, ముఖ్యమంత్రిగా మీ ముందు నిలబడడానికి ఆయనే స్ఫూర్తి. ఆయన పాటలు తూటాలై, మరఫిరంగులై గడీలను బద్ధలు కొట్టాయి.

## ఉద్యోగాలు అడిగితే ఎండ్రిన్ తాగి చావమంటున్నాడు

రంగారెడ్డి జిల్లా: 'రెండున్నరేళ్లలో కాంగ్రెస్ ప్రభుత్వం 70 వేల ఉద్యోగాలు ఇచ్చినట్లు నిరూపిస్తే.. నేను రాజకీయ సన్యాసం చేసి, రాహుల్‌గాంధీకి జై కొడతా' అని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ సరూర్‌నగర్ స్టేడి యం వేదికగా సీఎం రేవంత్‌రెడ్డికి సవాల్ విసిరారు. బీఆర్ఎస్ యువజన, విద్యార్థి విభా గం ఆధ్వర్యంలో శనివారం నిర్వహించిన 'యువ సంగ్రామ సదస్సు'కు ఆయన ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. 'ఇప్పటివరకు ఒక లెక్క.. ఇకపై మరోలెక్క.. ఉడుకు నెత్తురుతో ఉరకలెత్తే యువతరం ఇక్కడికి వచ్చింది. జంగ్ సైరన్ మోగించిన యంగ్ జనరేషన్ కాకతీయ, ఉస్మానియా, మహాత్మాగాంధీ, శాతవాహన వర్సిటీలతోపాటు అశోక్‌నగర్, దిల్‌సుఖ్‌నగర్ నుంచి యువశక్తి శివమెత్తి పోటెత్తింది. పిడికిళ్లు బిగిస్తే.. పీఠాలే కదిలిపోతాయి. తెలంగాణ ఉద్యమంలో యువత కలిసి వచ్చింది. రేపటి తెలంగాణ నిర్మాతలు మీరే. దేశ భవిష్యత్తుకు నిర్ణేతలు మీరు' అని కేటీఆర్ పేర్కొన్నారు. 'సరిగ్గా 38 నెలల క్రితం ఇదే నేలపై తెలంగాణ యువతకు దారుణమైన దగా జరిగింది. ప్రియాంకగాంధీతోపాటు ఢిల్లీ కాంగ్రెస్, గల్లీ కాంగ్రెస్, హై కమాండ్ నుంచి గాంధీలు, గాంధీ భవన్ నుంచి గాడ్సేలు కలిసి వచ్చి.. మాయామశ్చీంద్ర చేశారు. యూత్ డిక్లరేషన్ పేరుతో నయవంచనకు పాల్పడ్డారు. మన యువతకు 24 హామీలు ఇచ్చారు. నాలుగు వేల నిరుద్యోగ భృతి రాలేదు. డిగ్రీ పాసైతే రూ.లక్ష రాలేదు. పీహెచ్‌డీ చేస్తే రూ.ఐదు లక్షలు రాలేదు. అధిష్టాన పుత్రుడు రాహుల్‌గాంధీ అశోక్‌నగర్‌కు వచ్చిండు. చాయ్ తాగి, బిస్కెట్లు తిన్నడు. తెలంగాణ నిరుద్యోగులకు బిస్కెట్లు వేశాడు. రెండు (కేసీఆర్, కేటీఆర్) ఉద్యోగాలు తీసేస్తే.. ఒకేసారి రెండు లక్షల ఉద్యోగాలు ఇస్తామని చెప్పిండు. కొలువుల కుంభమేళా అన్నారు. కుంభకోణాల పర్వానికి తెరతీశారు. యూత్ డిక్లరేషన్ చేసిన రాహుల్‌గాంధీకి, ప్రియాంకగాంధీకి, రేవంత్‌రెడ్డికి డెత్ డిక్లరేషన్ రాయాల్సిన అవసరం ఉంది' అని కేటీఆర్ చెప్పారు. 'రాహుల్‌కు ప్రధాని జాబ్ వచ్చే వరకు విడిచి పెట్టబోనని సీఎం రేవంత్ చెబుతున్నాడు. తెలంగాణ యువత నిన్ను సీఎం చేసింది యువతకు జాబ్‌లు ఇవ్వాలని, లేక రాజకీయ నిరుద్యోగి రాహుల్‌కు ప్రధాని జాబ్ ఇవ్వమనా..? ఒక్క ఏడాదిలోనే రెండు లక్షల ఉద్యోగాలు ఇస్తామన్నారు. జాబులు నింపడం లేదు కానీ రాహుల్‌గాంధీ జేబులు, అన్నదమ్ముల అల్మారాలు బినామీల బీరువాలు నింపుతున్నాడు. ఉస్మానియా, కాకతీయ పీహెచ్‌డీ విద్యార్థులు.. 'ఓటు కోసం కోటి మోసాలు.. కాంగ్రెస్ నాటకాలు' అనే థీసిస్ చేయాలి. 20 వేల పోలీసు ఉద్యోగాలు ఖాళీగా ఉన్నాయని, వాటిని నింపాలని దిల్‌సుఖ్‌నగర్‌లో ఆందోళన చేస్తుంటే.. లాఠీలు ఝుళిపిస్తున్నాడు. దమ్ముంటే సెక్యూరిటీ లేకుండా వీఎం హోంకు రా? ఎవరు ఉంటారో? ఎవరు చస్తాడో తేలుతుంది. నీ క్లైమాక్స్ హిట్లర్ కంటే దారుణంగా ఉంటుంది' అని కేటీఆర్ చెప్పారు. 'పట్టాలు చేతపట్టుకుని, కిరాయి కట్టలేక, ఖాళీ కడుపుతో నిద్రహారాలు మాని పోటీ పరీక్షలకు సిద్ధమవుతున్న నిరుద్యోగుల పరిస్థితి మాకు తెలుసు. ఇలాంటి వారి జీవితాలతో కాంగ్రెస్, బీజేపీలు పరిహాసమాడుతున్నాయి. కేంద్రంలోని బడేభాయ్ ఏటా రెండు కోట్ల ఉద్యోగాలు ఇస్తానన్నాడు. ఇక్కడి చోటే భాయ్ రెండు లక్షల ఉద్యోగాలు ఇస్తామన్నాడు. పకోడీలు, చెకోడీలు వేసుకొమ్మని మోదీ చెబుతుంటే.. ఎండ్రిన్ తాగి చావండని రేవంత్ చెబుతున్నాడు. పోటీ పరీక్షలకు హాజరు కావడం, ఉద్యోగం కొట్టడం ఎంత కష్టమో నాకు తెలుసు.. కానీ బండి సంజయ్, రేవంత్ ఒక్క పోటీ పరీక్ష రాసిన ముఖం కాదు. తెచ్చుకున్న తెలంగాణ తెర్లవుతుంటే చూస్తూ ఊరుకోవాలా నేపాల్ మాదిరి భూకంపం పుట్టించమనడం లేదు.

## వాంగ్‌చుక్ దీక్ష భగ్నం!

(మొదటి పేజీ తరువాయి)

ఢిల్లీలోని జంతర్‌మంతర్ వద్ద ఆయన సాగిస్తున్న దీక్ష 21వ రోజుకు చేరుకోగా, ఆరోగ్య పరిస్థితి క్షీణిస్తుండడంతో ఢిల్లీ హైకోర్టు ఆదేశాల మేరకు శనివారం ఉదయం బలవంతంగా ఆసుపత్రికి తరలించారు. ఈ సందర్భంగా దీక్షా వేదిక వద్ద తీవ్ర ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయి. పోలీసులను అడ్డుకొనేందుకు వాంగ్‌చుక్ మద్దతుదారులు ప్రయత్నించారు. వాంగ్‌చుక్‌తోపాటు జూన్ 28న నిరాహార దీక్ష ప్రారంభించిన ఆలిండియా స్టూడెంట్స్ అసోసియేషన్(ఏఐఎస్ఏ) సభ్యులు నేహా, అమీన్, మనీష్ ను సైతం అరెస్టు చేసేందుకు పోలీసులు ప్రయత్నించగా సాధ్యం కాలేదు. ముగ్గురూ యథాతథంగా దీక్ష కొనసాగిస్తున్నారు. మరో వైపు వాంగ్‌చుక్‌ను ఆసుపత్రికి తరలించిన కొద్దిసేపటికే కాక్రోచ్ జనతా పార్టీ(సీజేపీ) వ్యవస్థాపకుడు అభిజిత్ దీప్కే నిరాహార దీక్ష ప్రారంభించారు. జంతర్‌మంతర్ వద్ద ఆయనపై ఓ మహిళ సిరా చల్లడం సంచలనాత్మకంగా మారింది. వాంగ్‌చుక్ దీక్షను భగ్నం చేయడాన్ని కాంగ్రెస్ అగ్రనేతలు మల్లికార్జున ఖర్గే, రాహుల్ గాంధీ తదితరులు తీవ్రంగా ఖండించారు. వాంగ్‌చుక్ నిరాహార దీక్షను విరమించలేదని, ఆసుపత్రి నుంచే దీక్షను కొనసాగిస్తారని కాక్రోచ్ జనతా పార్టీ (సీజేపీ) 'ఎక్స్'లో పోస్టుచేసింది. వాంగ్‌చుక్ దీక్షను భగ్నం చేసే విషయంలో నాటకీయ పరిణామాలు చోటుచేసుకున్నాయి. ఈ ఘటనకు ఒక్కరోజు ముందే కేంద్ర హోంశాఖ ఢిల్లీ పోలీస్ కమిషనర్ సతీశ్ గోల్చాను ఆకస్మికంగా తప్పించి, ఆయన స్థానంలో అనురాగ్ కుమార్‌ను నియమించింది. కొత్త కమిషనర్ వెంటనే తన కార్యాచరణ ప్రారంభించారు. శుక్రవారం రాత్రి పోలీసు అధికారులతో ప్రత్యేకంగా సమావేశమయ్యారు. శనివారం తెల్లవారుజామున సిబ్బందితో సహా హాజరు కావాలని ఆదేశించారు. 'పార్లమెంట్ వర్షాకాల సమావేశాల భద్రతా సన్నాహాల'పేరుతో పోలీసులు ఉదయం 5 గంటలకు జంతర్‌మంతర్ వద్దకు చేరుకున్నారు. దీక్షలు జరుగుతున్న ప్రాంతంలో మొబైల్ ఫోన్ జామర్ ఏర్పాటు చేశారు. సాధారణ దుస్తుల్లో ఉన్న పోలీసులు దీక్షా వేదిక చుట్టూ తెల్ల దుప్పట్లు ఏర్పాటు చేసి వాంగ్‌చుక్‌ను అక్కడి నుంచి తరలించే ప్రయత్నం చేశారు. ఈ దృశ్యాలను ఎవరూ ఫోన్లలో చిత్రీకరించకుండా తెల్ల దుప్పట్లను అడ్డంగా పెట్టారు. పోలీసులను అడ్డుకునేందుకు నిరసనకారులు మానవహారంగా నిలిచారు. అయినప్పటికీ దాదాపు ఐదుగురు పోలీసులు వాంగ్‌చుక్‌ను బలవంతంగా అంబులెన్స్‌లోకి చేర్చి, వెంటనే సఫ్దర్‌జంగ్ ఆస్పత్రికి తరలించారు. కోర్టు ఆదేశాల మేరకే వాంగ్‌చుక్‌ను ఆసుపత్రిలో చేర్చామని, ఆయనకు వైద్య చికిత్స కొనసాగుతోందని పోలీసులు వెల్లడించారు. ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా నగరంలోని కీలక ప్రాంతాల్లో కట్టుదిట్టమైన భద్రతా ఏర్పాట్లు చేశారు.చికిత్సకు వాంగ్‌చుక్ నిరాకరిస్తున్నారని డాక్టర్లు చెప్పారు. ఆయన ఆరోగ్య పరిస్థితిని దృష్టిలో పెట్టుకొని చికిత్సకు అంగీకరించేలా కౌన్సెలింగ్ ఇస్తున్నట్లు తెలిపారు. ఇంట్రావీనస్ ఫ్లూయిడ్స్, ఓరల్ రీహైడ్రేషన్ సొల్యూషన్, ఇతర ఔషధాలను తీసుకోవడానికి నిరాకరించారని పేర్కొన్నారు. ఈ మేరకు హెల్త్ బులెటిన్ విడుదల చేశారు.

# 2024లో రాజకీయ చెత్తను ప్రజలే శుభ్రం చేశారు

(మొదటి పేజీ తరువాయి)

తెలుగువారి ఆత్మగౌరవం అనే లక్ష్యాలతోనే ఎన్టీఆర్ తెలుగుదేశం పార్టీని స్థాపించారని తెలిపారు. గతంలో ఉన్న స్వార్థ రాజకీయాలను పక్కనపెట్టి అభివృద్ధి, సంక్షేమానికి ఆయన శ్రీకారం చుట్టారని అన్నారు. ప్రస్తుతం తమ ప్రభుత్వం అర్హులందరికీ సంక్షేమం, రాష్ట్రాభివృద్ధి, సంపద సృష్టి లక్ష్యంగా పనిచేస్తోందని చెప్పారు. శాంతిభద్రతల పరిరక్షణ, ప్రజల జీవన ప్రమాణాల మెరుగుదలకు కట్టుబడి ఉన్నామని హామీ ఇచ్చారు. పరిశుభ్రత అంటే కేవలం రోడ్లు ఊడ్చడం కాదని, పర్యావరణాన్ని, ప్రజారోగ్యాన్ని కాపాడటమే అసలు లక్ష్యమని వివరించారు. గత ప్రభుత్వ హయాంలో రాష్ట్రంలో 140 లక్షల మెట్రిక్ టన్నుల చెత్త పేరుకుపోయిందని, దానిని తొలగించి ఇప్పుడు స్వచ్ఛ పథం, ఆపరేషన్ క్లీన్ స్వీప్ వంటి కార్యక్రమాలతో రాష్ట్రాన్ని శుభ్రం చేస్తున్నామని చంద్రబాబు తెలిపారు. అక్టోబర్ 2 నాటికి రాష్ట్రాన్ని చెత్త రహితంగా మారుస్తామని ప్రకటించారు. దీనికోసం రూ.528 కోట్లతో వ్యర్థాల నిర్వహణ ప్లాంట్లు, చెత్త నుంచి విద్యుత్ ఉత్పత్తి చేసే 8 ప్లాంట్లను ఏర్పాటు చేస్తున్నామన్నారు. ఇంటింటికీ చెత్త సేకరణ కోసం 126 ఎలక్ట్రిక్ ఆటోలను ప్రారంభించామని, త్వరలో మరో 1104 ఇ-ఆటోలు అందుబాటులోకి వస్తాయని వెల్లడించారు. ప్రతి ఒక్కరూ తమ ఇంటి నుంచే తడి, పొడి చెత్తను వేరుచేయాలని, 'నెట్ జీరో' వ్యర్థాల విధానాన్ని అలవాటు చేసుకోవాలని పిలుపునిచ్చారు. గత ఐదేళ్ల పాలనలో రాష్ట్రంలో విధ్వంసం జరిగిందని, ప్రజలు సంతోషంగా జీవించే పరిస్థితి లేకపోయిందని చంద్రబాబు విమర్శించారు. రాజకీయాల్లో క్రిమినల్ ధోరణులు, కుట్రలు, సోషల్ మీడియాలో అసభ్య పోస్టులతో ప్రజలను వేధిస్తున్నారని ఆరోపించారు. డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ కుటుంబ సభ్యులపై అసభ్య పోస్టులు పెట్టి, ప్రశ్నిస్తే భావ ప్రకటనా స్వేచ్ఛ అనడం దారుణమన్నారు. ప్రజల జీవితాలకు ఆటంకం కలిగించే వారిని ఎట్టి పరిస్థితుల్లోనూ ఉపేక్షించబోమని హెచ్చరించారు. చట్టాన్ని ఎవరూ చేతుల్లోకి తీసుకోవడానికి వీల్లేదని, తప్పు చేసిన వ్యక్తి ఏ పార్టీకి చెందిన వారైనా కఠిన చర్యలు తప్పవని స్పష్టం చేశారు. గుంటూరులో మహిళ పట్ల దురుసుగా ప్రవర్తించిన టీడీపీ కార్యకర్తను తక్షణమే పార్టీ నుంచి సస్పెండ్ చేసి అరెస్ట్ చేయించామని, శ్రీకాకుళం ఘటనలోనూ బాధితులకు న్యాయం చేస్తామని తెలిపారు. తీవ్ర ఆర్థిక ఇబ్బందులు ఉన్నప్పటికీ సంక్షేమ పథకాలను కొనసాగిస్తున్నామని ముఖ్యమంత్రి తెలిపారు. ప్రభుత్వం వద్ద డబ్బు లేకపోయినా, పేదల పక్షాన నిలిచే మనసుందని అన్నారు. ఈ నెల 22 నుంచి 24 మధ్య "తల్లికి వందనం" పథకం కింద 67.47 లక్షల మంది విద్యార్థుల తల్లుల ఖాతాల్లో రూ.10,122 కోట్లు జమ చేయనున్నట్లు ప్రకటించారు. మరోవైపు, 12 ఏళ్ల క్రితం నీళ్లు లేక ఇబ్బంది పడిన కృష్ణా డెల్టాకు పట్టిసీమ ద్వారా 450 టీఎంసీల గోదావరి జలాలను అందించి రూ.50 వేల కోట్ల సంపద సృష్టించామని గుర్తుచేశారు. అక్వా రైతులకు యూనిట్‌కు రూ.1.50కే విద్యుత్ అందిస్తూ ఆదుకుంటున్నామని భరోసా ఇచ్చారు. ఈ కార్యక్రమంలో భాగంగా గుడివాడ బస్టాండ్ అభివృద్ధికి అన్నే నరసింహారావు దంపతులు రూ.3 కోట్లు విరాళం ప్రకటించారు. సాయి శ్వేత అనే గృహిణి అమరావతి కోసం తన బంగారు గాజులను విరాళంగా ఇచ్చారు. వారిని ముఖ్యమంత్రి అభినందించారు.

జాతీయ దిన పత్రిక
తొలివెలుగు
మన భాష.. మన పత్రిక..


## ప్రేమ పేరిట వేధింపులు.. రెండు ప్రాణాలు బలి

- మనస్తాపంతో తనువు చాలించిన కాబోయే డాక్టర్
- ఆమె మరణ వార్త విని యువకుడి ఆత్మహత్య
- మునుకుంట్లలో శోకసంద్రం.. కన్నీరుమున్నీరవుతున్న తల్లిదండ్రులు




**తొలివెలుగు, కట్టంగూర్:** ప్రేమ పేరుతో జరిగిన వేధింపులు నల్లగొండ జిల్లా కట్టంగూర్ మండలం మునుకుంట్ల గ్రామంలో తీవ్ర విషాదాన్ని నింపాయి. వేధింపులు తట్టుకోలేక ఓ వైద్య విద్యార్థిని ఆత్మహత్యకు పాల్పడగా, ఆ విషయం తెలిసి సదరు యువకుడు కూడా గంటల వ్యవధిలోనే బలవన్మరణానికి శరణు జొచ్చాడు. పోలీసులు, కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల ప్రకారం...

**చదువుల్లో రాణిస్తూ..**

మునుకుంట్ల గ్రామానికి చెందిన సుక్క లింగయ్య, యాదమ్మ దంపతుల చిన్న కుమార్తె సుక్క లక్ష్మీ ప్రసన్న (21) సూర్యాపేట ప్రభుత్వ వైద్య కళాశాలలో ఎంబీబీఎస్ ప్రథమ సంవత్సరం చదువుతోంది. పెద్ద కుమార్తె లక్ష్మీప్రియాంక హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీలో ఉన్నత చదువులు చదువుతోంది. లక్ష్మీ ప్రసన్న ప్రతిరోజూ గ్రామం నుంచే కళాశాలకు బస్సులో వెళ్లి వస్తుండేది. అయితే, అదే గ్రామానికి చెందిన చిలుముల రాంచరణ్ (25) కొంతకాలంగా లక్ష్మీ ప్రసన్నను ప్రేమ పేరుతో వేధిస్తున్నాడు. పెద్దలు పలుమార్లు మందలించినా అతని ప్రవర్తనలో మార్పు రాలేదు.

**మనస్తాపంతో ఉరివేసుకుని:**

వేధింపులు ఎక్కువ కావడంతో మనస్తాపానికి గురైన లక్ష్మీ ప్రసన్న ఈ నెల 16న కళాశాల నుంచి స్వగ్రామానికి వచ్చింది. శుక్రవారం ఇంట్లో ఎవరూ లేని సమయంలో పైకప్పు ఇనుప పైపునకు ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకుంది. సాయంత్రం ఇంటికి వచ్చిన సోదరి లక్ష్మీప్రియాంక తలుపులు తీసి చూడగా ప్రసన్న ఉరివేసుకుని కనిపించింది. వెంటనే స్థానికుల సాయంతో కిందకు దించి 108 సిబ్బందికి సమాచారం అందించగా, అప్పటికే ఆమె మృతి చెందినట్లు నిర్ధారించారు.

**గంటల వ్యవధిలోనే యువకుడి మృతి:**

లక్ష్మీ ప్రసన్న మరణ వార్త తెలియడంతో భయాందోళనకు గురైన నిందితుడు చిలుముల రాంచరణ్, తన వ్యవసాయ బావి వద్ద ఉన్న తాటిచెట్టుకు ఉరివేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. అంతకుముందు అతడు తన తండ్రి సమాధిపై రక్తంతో కొన్ని వ్యాఖ్యలు రాసినట్లు తెలిసింది. గంటల వ్యవధిలో ఇద్దరు యువతీయువకులు మృతి చెందడంతో గ్రామంలో ఉద్రిక్తత చోటు చేసుకోకుండా శాలిగౌరారం రూరల్ సీఐ రాజశేఖర్, కట్టంగూర్ ఎస్ఐ రవీందర్ ఆధ్వర్యంలో భారీ పోలీస్ బందోబస్తు ఏర్పాటు చేశారు. మృతదేహాలకు పోస్టుమార్టం నిర్వహించి కుటుంబ సభ్యులకు అప్పగించారు. బాధితురాలి సోదరి ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

## మురిసిన ముత్తైదువులు..
## వైభవంగా గోరింటాకు సంబరాలు

- మార్కండేయ ఆలయంలో పద్మశాలి మహిళల కోలాహలం
- ఆషాఢంలో గోరింటాకు ఆరోగ్యం, సౌభాగ్య ప్రతీక
- ఆషాఢంలో గోరింటాకు శాస్త్రీయం: ఆడెపు రమాదేవి

తొలివెలుగు, రాజపేట: మండల కేంద్రమైన రాజపేటలోని శ్రీ భక్త మార్కండేయ దేవస్థాన ఆవరణలో పద్మశాలి మహిళల ఆధ్వర్యంలో శనివారం ఆషాఢ మాస గోరింటాకు ఉత్సవాన్ని వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా మహిళలందరూ ఒకచోట చేరి ఒకరికొకరు గోరింటాకు పెట్టుకుంటూ పండుగ వాతావరణంలో ఈ కార్యక్రమాన్ని జరుపుకున్నారు.

**ఆరోగ్యానికి ఎంతో మేలు..**

ఈ వేడుకల్లో పవర్లూమ్ సొసైటీ డైరెక్టర్ ఆడెపు రమాదేవి పాల్గొని మాట్లాడారు. హిందూ సంప్రదాయంలో ఆషాఢ మాసంలో గోరింటాకు ధరించడం వెనుక శాస్త్రీయ కోణం ఉందని ఆమె పేర్కొన్నారు. ముఖ్యంగా వర్షాకాలంలో వచ్చే చర్మ, ఆరోగ్య సమస్యలను నివారించడంలో గోరింటాకు కీలక పాత్ర పోషిస్తుందని, దీనిని మహిళల సౌభాగ్యానికి ప్రతీకగా భావిస్తారని వివరించారు. సీజనల్ వ్యాధుల నుంచి ఇది రక్షణ కల్పిస్తుందని అన్నారు. ఈ ఉత్సవంలో రాజపేట మాజీ సర్పంచ్ ఆడెపు ఈశ్వరమ్మతో పాటు ప్రముఖులు మమత, మదూరి వజ్రమ్మ, పొట్టభత్తిని లావణ్య, చుంచు సరళ, కవిత, ఆడెపు కవిత, జ్యోతి, ఉమారాణి, నోరు ఉమా, నాగమణి, సీతా అరుణ, హేమలత, అశ్విని, లత, ఆడెపు రాణి, కళావతి, పొట్టబతిని భవాని తదితరులు అధిక సంఖ్యలో పాల్గొని కార్యక్రమాన్ని జయప్రదం చేశారు.



## చౌటుప్పల్‌లో కోతుల బెడదకు బ్రేక్: ఒకేరోజు 211 కోతుల బంధనం




- రాజమండ్రి నిపుణుల బృందంతో ప్రత్యేక డ్రైవ్
- ములుగు జిల్లా అటవీ ప్రాంతానికి తరలింపు
- మున్సిపల్ చైర్‌పర్సన్ మొగుదాల పావని రమేష్ గౌడ్

**తొలివెలుగు, చౌటుప్పల్ :** చౌటుప్పల్ పురపాలక సంఘం పరిధిలో గత కొన్నాళ్లుగా ప్రజలను తీవ్ర ఇబ్బందులకు గురిచేస్తున్న కోతుల బెడద నివారణకు మున్సిపల్ యంత్రాంగం ప్రత్యేక చర్యలు చేపట్టింది. పట్టణ ప్రజల రక్షణను దృష్టిలో ఉంచుకుని మున్సిపల్ చైర్‌పర్సన్ మొగుదాల పావని రమేష్ గౌడ్ ప్రత్యేక చొరవతో ఆంధ్రప్రదేశ్‌లోని రాజమండ్రి నుంచి కోతులు పట్టే నిపుణుల బృందాన్ని రప్పించారు.

**కీలక ప్రాంతాల్లో బోన్లు..**

రాజమండ్రికి చెందిన నిపుణుల బృందం పట్టణంలోని విద్యానగర్ పరిసరాలు, హెచ్‌పీ గ్యాస్ గోడౌన్ సమీపం, కచ్చీరు ప్రాంతాలలో ప్రత్యేక బోనులను ఏర్పాటు చేసింది. ఈ క్రమంలో శనివారం ఉదయం నిర్వహించిన డ్రైవ్‌లో సుమారు 211 కోతులను బంధించారు. చైర్‌పర్సన్ ఆదేశాల మేరకు పట్టుబడిన కోతులను సురక్షితంగా ములుగు జిల్లాలోని మాటు కొండూరు అటవీ ప్రాంతానికి ప్రత్యేక వాహనంలో తరలించి వదిలిపెట్టారు.

**ప్రజల సౌకర్యమే ప్రథమ ప్రాధాన్యత:**

"పట్టణ ప్రజల రక్షణ, సౌకర్యమే మా ప్రథమ ప్రాధాన్యత. గత కొన్నాళ్లుగా కోతుల వల్ల ప్రజలు పడుతున్న ఇబ్బందులను గమనించి ఈ ప్రత్యేక డ్రైవ్ చేపట్టాం. మున్సిపాలిటీని కోతుల బెడద నుండి విముక్తం చేసేందుకు ఈ చర్యలు నిరంతరం కొనసాగుతాయి."

**మొగుదాల పావని రమేష్ గౌడ్, మున్సిపల్ చైర్‌పర్సన్**

ఈ కార్యక్రమంలో మున్సిపల్ కౌన్సిలర్లు పాక చిరంజీవి, హన్ను మహమ్మద్, బద్రి గాలయ్య, చింతల ఉమామహేశ్వరి, నాయకులు చింతల సాయిలు, బత్తుల దాసు, మున్సిపల్ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు. కోతుల బెడద నుంచి ఉపశమనం కల్పించిన పాలకవర్గానికి పట్టణ ప్రజలు కృతజ్ఞతలు తెలిపారు. పట్టణంలో ఇంకా చాలా కోతులు ఉన్నాయని, ఈ డ్రైవ్‌ను ఇలాగే కొనసాగించి మున్సిపాలిటీని పూర్తిగా కోతుల రహితంగా మార్చాలని ప్రజలు కోరుతున్నారు.

## నీటి ప్రతి బొట్టునూ ఒడిసిపడదాం.. భూగర్భ జలాలను కాపాడుకుందాం

- అన్నా మెమోరియల్ స్కూల్‌లో 'జల ప్రతిజ్ఞ'
- భూగర్భ జలాల సంరక్షణ మనందరి బాధ్యత: మున్సిపల్ చైర్‌పర్సన్ పావని రమేష్ గౌడ్
- విద్యార్థులతో 'జల ప్రతిజ్ఞ' చేయించిన ప్రిన్సిపల్ చిన్నప్ప రెడ్డి




**తొలివెలుగు, చౌటుప్పల్ :** భూగర్భ జలాలను రక్షించుకోవాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందని, రాబోయే రోజుల్లో నీటిని అత్యంత పొదుపుగా వాడుకోవాలని చౌటుప్పల్ మున్సిపల్ చైర్‌పర్సన్ మొగుదాల పావని రమేష్ గౌడ్ పిలుపునిచ్చారు. చౌటుప్పల్ పురపాలక సంఘం ఆధ్వర్యంలో 'జాతీయ జల మిషన్' కార్యక్రమంలో భాగంగా శనివారం పట్టణంలోని అన్నా మెమోరియల్ స్కూల్ ప్రాంగణంలో విద్యార్థులకు ప్రత్యేక అవగాహన సదస్సు నిర్వహించారు.

**ఇంకుడు గుంతలు తప్పనిసరి:**

ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా మున్సిపల్ చైర్‌పర్సన్ హాజరుకాగా, పాఠశాల ప్రిన్సిపల్ చిన్నప్ప రెడ్డి విద్యార్థులు, ఉపాధ్యాయ బృందంతో 'జల ప్రతిజ్ఞ' చేయించారు. ఈ సందర్భంగా వక్తలు మాట్లాడుతూ.. ఎల్ నినో ప్రభావం వల్ల భవిష్యత్తులో వర్షాభావ పరిస్థితులు ఏర్పడే అవకాశం ఉందని అధికారిక హెచ్చరికలు ఉన్నందున, ప్రతి ఒక్కరూ అప్రమత్తంగా ఉండాలన్నారు. ఇళ్ల వద్ద ఇంకుడు గుంతలను తప్పనిసరిగా నిర్మించుకోవాలని సూచించారు. వర్షపు నీటి ప్రతి బొట్టునూ ఒడిసిపట్టి భూమిలోకి ఇంకేలా చేయడం ద్వారానే భూగర్భ జలమట్టాలను పెంచుకోగలమని, పర్యావరణ పరిరక్షణలో యువత, విద్యార్థులు అగ్రభాగంలో నిలవాలని కోరారు. ఈ అవగాహన కార్యక్రమంలో సీఐ మన్మథ కుమార్, స్థానిక కౌన్సిలర్ బుడ్డ సురేష్, మున్సిపల్ కౌన్సిలర్లు చింతల ఉమామహేశ్వరి, నాయకులు సత్యం, పాఠశాల సీబీఎస్ఈ ప్రిన్సిపల్ సునీత, మున్సిపల్ అధికారులు హనుమాన్ ప్రసాద్ (శానిటరీ ఇన్‌స్పెక్టర్), రేణు కుమార్ (పర్యావరణ ఇంజనీర్), వార్డు ఆఫీసర్లు పవన్ కుమార్, కిరణ్ కుమార్, శ్రీనాథ్ (జేఏవో), ఉపేందర్ (బిల్ కలెక్టర్), జవాన్ వంశీ, పాఠశాల సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

## ప్రభుత్వ జూనియర్ కళాశాలలో 'జాతీయ జల మిషన్' సదస్సు

- భూగర్భ జలాల సంరక్షణ మనందరి బాధ్యత: మున్సిపల్ కమిషనర్ వెంకటేశ్వర నాయక్
- నీటిని పొదుపుగా వాడుకోవాలని విద్యార్థులకు పిలుపు.. సామూహిక జల ప్రతిజ్ఞ

**తొలివెలుగు, చౌటుప్పల్ :** భూగర్భ జలాలను రక్షించుకోవాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందని, రాబోయే రోజుల్లో నీటిని చాలా పొదుపుగా వాడుకోవాలని చౌటుప్పల్ మున్సిపల్ కమిషనర్ వెంకటేశ్వర నాయక్ అన్నారు. చౌటుప్పల్ పురపాలక సంఘం ఆధ్వర్యంలో 'జాతీయ జల మిషన్' కార్యక్రమంలో భాగంగా శనివారం స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలలో విద్యార్థులకు ప్రత్యేక అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులు, అధికారులందరూ కలిసి 'జల ప్రతిజ్ఞ' చేశారు.

**'ఎల్ నినో'పై అప్రమత్తత అవసరం..**

ఈ సదస్సులో కమిషనర్ మాట్లాడుతూ.. ఎల్ నినో ప్రభావం వల్ల భవిష్యత్తులో వర్షాభావ పరిస్థితులు ఏర్పడే అవకాశం ఉందనే అధికారిక హెచ్చరికల నేపథ్యంలో విద్యార్థులు, ప్రజలు అలర్ట్‌గా ఉండాలని సూచించారు. లభ్యతగా ఉన్న నీటిని వృథా చేయకుండా సద్వినియోగం చేసుకోవాలన్నారు. వర్షపు నీటి ప్రతి బొట్టునూ ఒడిసిపట్టి భూమిలోకి ఇంకేలా చేయడం ద్వారానే భూగర్భ జలమట్టాలను పెంచుకోగలమని వివరించారు. పర్యావరణ పరిరక్షణ, జల సంరక్షణ ఉద్యమంలో యువత, విద్యార్థులు అగ్రభాగంలో నిలిచి అధిక సంఖ్యలో భాగస్వాములు కావాలని కోరారు. ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపల్ కృష్ణారెడ్డి, లెక్చరర్ల బృందంతో పాటు మున్సిపల్ అధికారులు రేణు కుమార్ (పర్యావరణ ఇంజనీర్), పవన్ కుమార్ (వార్డ్ ఆఫీసర్), శ్రీనాథ్ (జేఏవో), ఉపేందర్ (బిల్ కలెక్టర్), రమాదేవి (ఆర్ పీ), మున్సిపల్ సిబ్బంది మరియు విద్యార్థులు చురుగ్గా పాల్గొన్నారు.






## ఘనంగా ఎమ్మెల్యే జగదీష్ రెడ్డి జన్మదిన వేడుకలు

- సూర్యాపేట అభివృద్ధి శిల్పి మాజీ మంత్రి: బిఆర్ఎస్ జిల్లా నాయకుడు దేవత్ వేణు
- బదిరుల పాఠశాలలో అల్పాహారం, స్వీట్ల పంపిణీ

**తొలివెలుగు, సూర్యాపేట :** సూర్యాపేట నియోజకవర్గ సమగ్ర అభివృద్ధికి మాజీ మంత్రి, ఎమ్మెల్యే జగదీష్ రెడ్డి చేసిన సేవలు చిరస్మరణీయమని బీఆర్ఎస్ జిల్లా నాయకులు దేవత్ వేణు కొనియాడారు. శనివారం జగదీష్ రెడ్డి జన్మదినాన్ని పురస్కరించుకుని జిల్లా కేంద్రంలోని అపూర్వ బదిరుల పాఠశాలలో ప్రత్యేక వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థుల సమక్షంలో కేక్ కట్ చేసి, వారికి అల్పాహారంతో పాటు స్వీట్లను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా దేవత్ వేణు మాట్లాడుతూ.. గత 60 ఏళ్లలో జరగని అభివృద్ధిని కేవలం పదేళ్ల కాలంలోనే పూర్తి చేసి సూర్యాపేట రూపురేఖలను మార్చిన ఘనత జగదీష్ రెడ్డికే దక్కుతుందన్నారు. ప్రజల సంక్షేమంతో పాటు మౌలిక వసతుల కల్పన, తాగునీరు, విద్య, వైద్యం, రహదారుల నిర్మాణ రంగాల్లో ఆయన విశేష కృషి చేశారని పేర్కొన్నారు. జగదీష్ రెడ్డి నిండు నూరేళ్లు ఆయురారోగ్యాలతో వర్ధిల్లాలని ఆకాంక్షించారు. అనంతరం పట్టణంలోని 32వ వార్డులో దేవత్ వేణు ఆధ్వర్యంలో జగదీష్ రెడ్డి జన్మదిన వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమాల్లో టీఆర్ఎస్వీ జిల్లా నాయకులు పన్ను, సాయి, సంతోష్, అశోక్, సాయి, సుమన్,చక్రధర్, వినయ్, చింటూ, ప్రసన్న పాల్గొన్నారు.

## 'మా భూములు మాకే'నని తిరగబడ్డ రైతులు

శంషాబాద్ : రంగారెడ్డి జిల్లా శంషాబాద్ మండలం బహదూర్‌గూడ గ్రామంలో బుల్లెట్ ట్రైన్ హబ్ కోసం శనివారం జరిగిన భూసేకరణ ప్రక్రియ పోలీసుల అత్యుత్సాహంతో తీవ్ర ఉద్రిక్తతలకు దారితీసింది. శాంతియుతంగా నిరసన చేపడుతున్న రైతులు, గ్రామస్తులపై పోలీసులు దురుసుగా ప్రవర్తించారు. వారిని అక్కడి నుంచి తరలించే ప్రయత్నం చేయడంతో ఒక్కసారిగా పోలీసులకు, రైతులకు మధ్య వాగ్వాదం చోటుచేసుకొన్నది. దీంతో గ్రామంలో ఉద్రిక్త వాతావరణం నెలకొన్నది. గ్రామానికి వెళ్లే ప్రధాన మార్గాల్లో పోలీసులు బారికేడ్లు ఏర్పాటుచేశారు. భూసేకరణను వ్యతిరేకిస్తూ రైతులు నినాదాలు చేస్తూ అధికారులను నిలదీశారు. అధికారులు, రైతుల మధ్య వాగ్వాదం చోటుచేసుకోవడంతో కొంతసేపు ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయి. రైతులకు మద్దతుగా పలువురు రాజకీయ నాయకులు, ప్రజాసంఘాల ప్రతినిధులు గ్రామానికి చేరుకొనే ప్రయత్నం చేయగా, పోలీసులు వారిని సైతం అడ్డుకొన్నారు. తమ అభిప్రాయాలు తెలుసుకోకుండా సరైన పరిహారం. పునరావాసంపై స్పష్టత ఇవ్వకుండా భూములు స్వాధీనం చేసుకోవడం సరికాదని రైతులు ఈ సందర్భంగా ఆవేదన వ్యక్తం చేశారు.

## మద్యానికి మరో ప్రాణం బలి.. అనాథలైన ఇద్దరు కుమార్తెలు

- రోడ్డు పక్కన శవమై కనిపించిన అశోక్
- కలహాలతో పుట్టింటికి వెళ్లిన భార్య.. అంతలోనే ఘోరం
- బేగంపేటలో విషాదం



**తొలివెలుగు, రాజాపేట:** మితిమీరిన మద్యపానం ఓ నిండు ప్రాణాన్ని బలితీసుకుంది. కట్టుకున్న భార్య దూరమై, కన్న కూతుళ్లు అనాథలైన విషాద ఘటన రాజాపేట మండలం బేగంపేటలో చోటుచేసుకుంది. గ్రామానికి చెందిన బిచాల అశోక్ రోడ్డు పక్కన శవమై కనిపించడం స్థానికంగా కలకలం రేపింది. తొమ్మిదేళ్ల క్రితం అశోక్ కు మౌనికతో వివాహం కాగా, ఇద్దరు కుమార్తెలు జన్మించారు. సజావుగా సాగుతున్న వీరి సంసారంలో కుటుంబ తగాదాలు చిచ్చురేపాయి. దీంతో వేగలేకపోయిన భార్య మౌనిక పిల్లలను తీసుకుని మెదక్ జిల్లా తూప్రాన్ లోని తన తల్లిగారి ఇంటికి వెళ్లిపోయింది. భార్యాపిల్లలు దూరం కావడంతో అశోక్ మద్యానికి బానిసయ్యాడు. రాత్రింబవళ్లు తాగుతూ ఆరోగ్యాన్ని పూర్తిగా పాడుచేసుకున్నాడు. ఈ క్రమంలో శుక్రవారం రాత్రి ఊరి చివర రోడ్డు పక్కన ఉన్న ట్రాన్స్‌ఫార్మర్ వద్ద అశోక్ అపస్మారక స్థితిలో పడి ఉండి ప్రాణాలు విడిచాడు. సమాచారం అందుకున్న భార్య మౌనిక శనివారం పోలీసులను ఆశ్రయించింది. భర్త మరణంపై భార్య మౌనిక ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ లింగారెడ్డి తెలిపారు.

## రాజాపేట మండలంలో రేపటి నుంచి రెవెన్యూ గ్రామసభలు

- భూ పునః సర్వేపై రైతులకు అవగాహన
- నాలుగు పైలట్ గ్రామాల్లో సదస్సులు: తహసిల్దార్ గోలి రవికిరణ్



**తొలివెలుగు, రాజాపేట:** మండలంలోని పైలట్ ప్రాజెక్టుకు ఎంపికైన నాలుగు గ్రామాల్లో భూ పునఃసర్వే (రీ-సర్వే) ప్రక్రియపై రైతులకు అవగాహన కల్పించేందుకు ఈ నెల 20, 21 తేదీల్లో రెవెన్యూ గ్రామసభలు నిర్వహిస్తున్నట్లు రాజాపేట తహసిల్దార్ గోలి రవికిరణ్ తెలిపారు. శనివారం రాజాపేటలో విలేకరులతో మాట్లాడిన ఆయన, భూముల కొలతలు, రీ-సర్వే విధానం, రైతులు తీసుకోవాల్సిన జాగ్రత్తలు, సందేహాలకు సమాధానాలు గ్రామసభల్లో వివరించనున్నట్లు చెప్పారు. గ్రామసభల షెడ్యూల్ ప్రకారం ఈ నెల 20న ఉదయం బసంతాపురం, మధ్యాహ్నం కాల్వపల్లి గ్రామాల్లో, ఈ నెల 21న ఉదయం లక్ష్మక్కపల్లి, మధ్యాహ్నం బూరుగుపల్లి గ్రామాల్లో సమావేశాలు నిర్వహించనున్నట్లు తెలిపారు. ఈ గ్రామసభల్లో రెవెన్యూ శాఖతో పాటు మండల పరిషత్ అభివృద్ధి అధికారి (ఎంపీడీవో), మండల వ్యవసాయ అధికారి, పంచాయతీ అధికారి, పంచాయతీరాజ్, ఆర్అండ్‌బీ, నీటిపారుదల శాఖల ఇంజినీరింగ్ అధికారులు పాల్గొని రైతులకు అవసరమైన వివరాలు అందజేస్తారని పేర్కొన్నారు. పైలట్ గ్రామాల రైతులు, భూ యజమానులు తప్పనిసరిగా హాజరై రీ-సర్వే ప్రక్రియపై పూర్తి అవగాహన పొందాలని తహసిల్దార్ గోలి రవికిరణ్ విజ్ఞప్తి చేశారు.

## స్వగ్రామంలో డిఆర్‌డీఎల్ డైరెక్టర్ డా. అంకతి రాజుకు సత్కారం

- సాదరంగా స్వాగతించిన గ్రామ పంచాయతీ పాలకవర్గం
- వెంకటేశ్వరస్వామి ఆలయ సమీపంలో మొక్క నాటిన శాస్త్రవేత్త



**తొలివెలుగు, రాజాపేట:** రక్షణ పరిశోధన, అభివృద్ధి సంస్థ (డిఆర్‌డీఎల్) డైరెక్టర్ డాక్టర్ అంకతి రాజు శనివారం తన స్వగ్రామమైన రాజాపేటకు విచ్చేశారు. ఈ సందర్భంగా రాజాపేట గ్రామ పంచాయతీ పాలకవర్గం ఆయనకు సాదర స్వాగతం పలికి, ఘనంగా సత్కరించింది. రాజాపేటలో పుట్టి దేశ రక్షణ రంగంలో అత్యున్నత స్థాయికి ఎదిగిన డాక్టర్ అంకతి రాజు గ్రామానికి ఎంతో గర్వకారణమని స్థానిక ప్రతినిధులు కొనియాడారు. సత్కార అనంతరం ఆయన స్థానిక శ్రీ వెంకటేశ్వర స్వామి దేవాలయ సమీపంలో మొక్కను నాటారు. పర్యావరణ పరిరక్షణలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని ఈ సందర్భంగా ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో రాజాపేట గ్రామ పంచాయతీ సర్పంచి కోయ మధు, ఉపసర్పంచి నమిల కేదారి గౌడ్, పంచాయతీ వార్డు సభ్యులు, స్థానిక నాయకులు, డైరెక్టర్ డాక్టర్ అంకతి రాజు కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

## ఆటో ఢీకొని ద్విచక్రవాహనదారుడు దుర్మరణం

- ఎస్. లింగోటం గ్రామ పరిధిలో ప్రమాదం
- గోకారం గ్రామానికి చెందిన నారి అశోక్ మృతి

**తొలివెలుగు, చౌటుప్పల్ :** మున్సిపాలిటీ పరిధిలోని ఎస్. లింగోటం సమీపంలో జరిగిన ఘోర రోడ్డు ప్రమాదంలో ఒకరు అక్కడికక్కడే మృతి చెందారు. పోలీసుల కథనం ప్రకారం.. వలిగొండ మండలం గోకారం గ్రామానికి చెందిన రైతు నారి అశోక్ (45) ఈ నెల 17న రాత్రి తన ద్విచక్రవాహనం (ఏపీ24బీఏ0643) పై వ్యక్తిగత పని నిమిత్తం గోకారం నుండి చౌటుప్పల్ వైపు వస్తున్నారు. మార్గమధ్యంలో ఎస్. లింగోటం గ్రామ పరిధిలోని జియో ఫాస్ట్ కంపెనీ వద్దకు చేరుకోగానే, చౌటుప్పల్ నుండి వలిగొండ వైపు అతివేగంగా, అజాగ్రత్తగా వెళ్తున్న ప్యాసింజర్ ఆటో (టీఎస్30టీ7369) ఎదురుగా వచ్చి అశోక్ బైక్‌ను బలంగా ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో అశోక్ కింద పడిపోవడంతో తల ముందు, వెనుక భాగంలో బలమైన రక్తగాయాలయ్యాయి. ప్రమాద తీవ్రతకు ఆటో గ్లాస్ పగిలి ముక్కలు ఆయన మెడ కింది భాగంలో గుచ్చుకోవడంతో తీవ్ర రక్తస్రావమై అక్కడికక్కడే ప్రాణాలు విడిచారు. అదే గ్రామానికి చెందిన పబ్బు శంకర్ ప్రమాదాన్ని చూసి కుటుంబ సభ్యులకు సమాచారం అందించారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం చౌటుప్పల్ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. మృతుడి భార్య నారి రమణ ఇచ్చిన ఫిర్యాదు మేరకు చౌటుప్పల్ మున్సిపాలిటీకి చెందిన ఆటో డ్రైవర్ రాచకండ రాజశేఖర్‌పై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ మన్మథ కుమార్ తెలిపారు.

## శివారెడ్డిగూడెంలో సందడిగా సినిమా చిత్రీకరణ





- దర్శకుడు అనిల్ రావిపూడి ఆధ్వర్యంలో షూటింగ్
- పాల్గొన్న నటులు వెంకటేష్, కీర్తి సురేష్
- 2027 సంక్రాంతికి చిత్రం విడుదల

**తొలివెలుగు, భూదాన్ పోచంపల్లి :** మండలంలోని శివారెడ్డిగూడెం గ్రామంలో శనివారం ప్రముఖ దర్శకుడు అనిల్ రావిపూడి దర్శకత్వంలో తెరకెక్కుతున్న నూతన చిత్ర షూటింగ్ సందడిగా సాగింది. గ్రామానికి చెందిన మేకల అశోక్ రెడ్డి వ్యవసాయ పొలాల మధ్య హీరో వెంకటేష్, జాతీయ ఉత్తమ నటి అవార్డు గ్రహీత కీర్తి సురేష్, గబ్బర్ సింగ్ గ్యాంగ్ పై కీలక టాకీ పార్ట్ సన్నివేశాలను చిత్రీకరించారు. ఈ సందర్భంగా దర్శకుడు అనిల్ రావిపూడి మాట్లాడుతూ.. సురేష్ ప్రొడక్షన్స్, జీ స్టూడియోస్ సంయుక్త ఆధ్వర్యంలో నిర్మిస్తున్న ఈ చిత్రానికి ఇంకా టైటిల్ ఖరారు చేయలేదన్నారు. వినోదం, యాక్షన్, డ్రామా కలబోతగా ఈ చిత్రాన్ని రూపొందిస్తున్నామని తెలిపారు. ఈ సినిమాను 2027 సంక్రాంతికి విడుదల చేయనున్నట్లు ప్రకటించారు. ఇందులో భాగంగానే హీరో కళ్యాణ్ రామ్ పై ఒక పాటను కూడా చిత్రీకరించామని, షూటింగ్ శరవేగంగా జరుగుతోందని వివరించారు. ఈ చిత్రానికి ప్రముఖ సంగీత దర్శకుడు జీవీ ప్రకాష్ సంగీతం అందిస్తున్నారు. కాగా, తమ గ్రామంలో సినిమా షూటింగ్ జరుగుతోందని తెలుసుకున్న యువకులు, స్థానికులు అధిక సంఖ్యలో అక్కడికి చేరుకుని ఆసక్తిగా తిలకించారు.

## ఘనంగా యూటీఎఫ్ పూర్వ జిల్లా అధ్యక్షుడు బలరాం వర్ధంతి

- ఆయన ఆశయాలను సాధిస్తాం: టీఎస్‌యూటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు ముక్కెర్ల యాదయ్య
- చందన స్కూల్ ఆవరణలో ఘన నివాళి



**తొలివెలుగు, చౌటుప్పల్ :** ఉమ్మడి నల్గొండ జిల్లా యూటీఎఫ్ పూర్వ జిల్లా అధ్యక్షుడు, కీర్తిశేషులు నల్లబెల్లి బలరాం ఆశయాలను సాధిస్తామని తెలంగాణ రాష్ట్ర ఐక్య ఉపాధ్యాయ ఫెడరేషన్ (టీఎస్‌యూటీఎఫ్) యాదాద్రి భువనగిరి జిల్లా అధ్యక్షుడు ముక్కెర్ల యాదయ్య అన్నారు. టీఎస్‌యూటీఎఫ్ చౌటుప్పల్ డివిజన్ ఆధ్వర్యంలో శనివారం స్థానిక చందన స్కూల్ ఆవరణలో నల్లబెల్లి బలరాం ద్వితీయ వర్ధంతి సభ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి ఘన నివాళులర్పించారు.

**ఉపాధ్యాయ రంగానికి విశేష సేవలు..**

ఈ సందర్భంగా ముక్కెర్ల యాదయ్య మాట్లాడుతూ.. నల్లబెల్లి బలరాం చిట్యాల మండలం తాళ్ల వెల్లంల గ్రామంలో నిరుపేద కుటుంబంలో జన్మించి, ఉపాధ్యాయ వృత్తిని చేపట్టి విద్యార్థులకే కాక విద్యా రంగానికి, ఉపాధ్యాయులకు విశేష సేవలు అందించారని కొనియాడారు. ఆయన నిక్కచ్చిగా పనిచేసే స్వభావం, అభ్యుదయ భావాలు కలిగిన వారని, సమాజాభివృద్ధిలో భాగస్వాములైన త్యాగజీవి అని గుర్తుచేశారు. ఈ కార్యక్రమంలో ఉమ్మడి నల్గొండ జిల్లా పూర్వ యూటీఎఫ్ కార్యదర్శి అవ్వారి గోవర్ధన్, టీ ఎస్ రాష్ట్ర కమిటీ సభ్యులు మిర్యాల దామోదర్, యాదాద్రి భువనగిరి జిల్లా ఉపాధ్యక్షురాలు శ్రీమతి మమత, జిల్లా కార్యదర్శులు వెంకటరెడ్డి, కంచి రవికుమార్, చౌటుప్పల్ మండల ప్రధాన కార్యదర్శి సిద్దగోని పరమేశం, బీబీనగర్ మండల బాధ్యులు నర్సిరెడ్డి, సీనియర్ నాయకులు మోహన్ రెడ్డి, జగన్, బిక్షపతి, నాగభూషణం, జి. వెంకటేశం, బాలకృష్ణ, సతీష్ కుమార్, యాదమ్మ, ఐద్వా జిల్లా అధ్యక్షురాలు అవ్వారు రామేశ్వరి, సీఐటీయూ జిల్లా కోశాధికారి పాషా, ప్రజానాట్యమండలి జిల్లా ఉపాధ్యక్షులు గోశిక కరుణాకర్, బాలల సంఘం నాయకుడు తొలుపునూరి మల్లేష్ తదితరులు పాల్గొన్నారు.



## 'యువ సంగ్రామ సభ'కు తరలిన బీఆర్ఎస్ శ్రేణులు

- చంద్రాయణగుట్ట నుంచి సరూర్‌నగర్‌కు భారీ బైక్ ర్యాలీ
- హామీలు నెరవేర్చే వరకు పోరాటం: ముప్పిడి సీతారాం రెడ్డి

**తొలివెలుగు, ఎల్‌బీ నగర్:** రాష్ట్రవ్యాప్తంగా యువత, నిరుద్యోగుల సమస్యలపై పోరాడేందుకు బీఆర్ఎస్ పార్టీ పిలుపునిచ్చిన "యువ సంగ్రామ సభ"కు చంద్రాయణగుట్ట నియోజకవర్గం నుంచి శ్రేణులు భారీగా తరలివెళ్లాయి. నియోజకవర్గ ఇన్‌చార్జి ముప్పిడి సీతారాం రెడ్డి నేతృత్వంలో నిరుద్యోగ యువతీయువకులు, పార్టీ ముఖ్య నాయకులు వందలాది బైక్‌లతో సభకు బయలుదేరారు.

**సరూర్‌నగర్ మైదానం వరకు ర్యాలీ:**

"వెల్‌కమ్ టు చంద్రాయణగుట్ట" గేట్ వద్ద ప్రారంభమైన ఈ బైక్ ర్యాలీ ఎల్బీనగర్ పరిధిలోని సరూర్‌నగర్ ప్లే గ్రౌండ్ సభా ప్రాంగణం వరకు ఉత్సాహంగా సాగింది. ఈ సందర్భంగా బీఆర్ఎస్ నాయకులు మాట్లాడుతూ.. కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల సమయంలో నిరుద్యోగులకు ఇచ్చిన హామీలను నెరవేర్చడంలో పూర్తిగా విఫలమైందని ధ్వజమెత్తారు. ఉద్యోగాల భర్తీ ప్రక్రియను వేగవంతం చేయాలని, నిరుద్యోగ భృతితో పాటు ఇతర వాగ్దానాలను తక్షణమే అమలు చేయాలని డిమాండ్ చేశారు. యువతకు న్యాయం జరిగే వరకు బీఆర్ఎస్ ఆధ్వర్యంలో పోరాటాలు కొనసాగుతాయని స్పష్టం చేశారు. ఈ ర్యాలీలో కాంటెస్టెడ్ కార్పొరేటర్లు ఆకుల శ్రీనివాస్, జమ్మిచెట్టు రాజు, సీనియర్ నాయకులు నరేష్ కుమార్, ఫిరోజ్ ఖాన్, ఇమ్రాన్ ఖాన్, నదీమ్, పవన్ రెడ్డి, సీసాల రాములు ముదిరాజ్, శంకర్ నాయక్, కృష్ణ శంకర్ ముదిరాజ్, యువ నాయకులు సాయి, సల్మాన్, గంగిశెట్టి అజయ్ కుమార్‌తో పాటు అధిక సంఖ్యలో మహిళలు, యువకులు పాల్గొన్నారు.

## అయ్యప్ప దేవాలయ ట్రస్టును వెంటనే రద్దు చేయాలి

- ఆలయం వద్ద గురుస్వాముల నిరసన ప్రదర్శన
- ఏకపక్షంగా బోర్డు ఏర్పాటు చేశారని ఆరోపణ



**తొలివెలుగు, భూదాన్ పోచంపల్లి :** ఎలాంటి తీర్మానాలు, ముందస్తు అనుమతులు లేకుండా ఏకపక్షంగా ఏర్పాటు చేసిన అయ్యప్ప స్వామి దేవాలయ ట్రస్ట్ బోర్డును వెంటనే రద్దు చేయాలని గురుస్వాములు డిమాండ్ చేశారు. అయ్యప్ప భక్త సమాజం ఆధ్వర్యంలో శనివారం పురపాలక కేంద్రంలోని ఆలయం ఎదుట సుమారు 40 మంది గురుస్వాములు నిరసన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా నిరసనకారులు మాట్లాడుతూ.. భక్తులందరినీ సంప్రదించకుండా, ఎలాంటి నిబంధనలు పాటించకుండా ఏకపక్ష నిర్ణయాలతో ఏర్పాటు చేసిన ట్రస్ట్ బోర్డు చెల్లదన్నారు. ఈ బోర్డును వెంటనే రద్దు చేయాలని, అందరి సమక్షంలో నూతన కమిటీని ఏర్పాటు చేసి ఆలయ అభివృద్ధికి తోడ్పడాలని కోరారు. డిమాండ్ నెరవేరే వరకు తమ నిరసనలు కొనసాగుతాయని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ వైస్ చైర్మన్ రజిని కొయ్యడ శ్రీనివాస్, గంగాపురం వెంకటేష్, తండ వెంకటేష్, బోడిగ బాబు, శెట్టి శ్రీనివాస్, దొంత సుదర్శన్, బొడిగ లింగం గౌడ్, రచ్చ రామకృష్ణ, తండ రమేష్, భోగ విష్ణు, అంకం మురళి, ముప్పిడి శ్రీనివాస్, వంగూరి పాండు, కీర్తి సంజీవ, బద్దం జితేందర్ రెడ్డి, సబ్బు గాని శంకర్, కోసిన వీరేష్, రేగొండ సృజన్, అంకం సాయి, అంకం వినోద్, శివ చారి, శ్రీనాథ్, సునీల్, మనీష్, నవభారత్ పాల్గొన్నారు.



## శ్రీగిరి క్షేత్రంలో వైభవంగా జగన్నాథ రథోత్సవం, కల్యాణ వేడుకలు

- భక్తిశ్రద్ధలతో సామూహిక హోమాలు
- ఆలయ ముఖమండపంలో గోరింటాకు మహోత్సవం

**తొలివెలుగు, రాజాపేట:** రాజాపేట మండలం రేణికుంట పరిధిలోని శ్రీగిరి సంకల్ప సిద్ధి శ్రీ వెంకటేశ్వర స్వామి దేవస్థానంలో శనివారం వివిధ ఆధ్యాత్మిక, విశేష పూజా కార్యక్రమాలను ఘనంగా నిర్వహించారు. ఆలయ ట్రస్ట్ కమిటీ ఆధ్వర్యంలో జరిగిన ఈ వేడుకల్లో పరిసర గ్రామాల నుంచి భక్తులు, దాతలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

**హోమాలు.. కల్యాణోత్సవం**

శనివారం ఉదయం నుంచే ఆలయంలో వైదిక కార్యక్రమాలు ప్రారంభమయ్యాయి. స్వామివార్ల అనుగ్రహం కోసం లోకకల్యాణార్థం వరాహ స్వామి హోమం, లక్ష్మీ నరసింహ స్వామి హోమం, సుదర్శన హోమాలను శాస్త్రోక్తంగా నిర్వహించారు. అనంతరం శ్రీ వెంకటేశ్వర స్వామివారి కల్యాణ మహోత్సవాన్ని సాంప్రదాయబద్ధంగా జరిపారు. నయనానందకరంగా రథయాత్ర మధ్యాహ్నం ఆలయ తిరువీధులలో శ్రీ జగన్నాథ, బలభద్ర, సుభద్ర అమ్మవార్ల దివ్య రథయాత్ర (రథోత్సవం) వైభవంగా సాగింది. భక్తుల జయజయధ్వానాలు, హరినామ సంకీర్తనలు, భజనల మధ్య రథాన్ని లాగారు. ఈ సందర్భంగా జగన్నాథ స్వామికి, లక్ష్మీ నరసింహ స్వామికి మహాహారతులు సమర్పించారు. అనంతరం భక్తులకు తీర్థప్రసాదాల వితరణ, మధ్యాహ్నం 1:30 గంటలకు అన్నప్రసాద వితరణ (మహాప్రసాదం) చేపట్టారు. జగన్నాథుడి రథాన్ని దర్శించినా, రథసేవలో పాల్గొన్నా స్వామివారి కృప లభిస్తుందని ఆలయ ట్రస్ట్ సభ్యులు తెలిపారు. ఆషాఢ మాసాన్ని పురస్కరించుకొని ఆలయ ముఖమండపంలో మహిళలకు గోరింటాకు మహోత్సవాన్ని నిర్వహించారు. ఈ వేడుకల్లో దేవాలయ ట్రస్ట్ యాజమాన్య సభ్యులు సూదిరెడ్డి నాగిరెడ్డి-కళావతి, కుంభాల ఎల్లారెడ్డి-శోభారాణి, కూర బద్రీనాథ్-కళ్యాణి, సమ్మెట రాఘవేంద్ర-మంజుల, వట్టం శ్రీనివాస్-రాజేశ్వరి పాల్గొన్నారు.



# బకాయి స్కాలర్‌షిప్‌లు తక్షణమే విడుదల చేయాలి

- రూ.10,500 కోట్లు నిలిపివేయడంపై ఎస్ఎఫ్ఐ ఆగ్రహం
- చౌటుప్పల్‌లో ప్రైవేట్ యాజమాన్యాలతో రౌండ్ టేబుల్ సమావేశం



**తొలివెలుగు, చౌటుప్పల్:** రాష్ట్రంలో పెండింగ్‌లో ఉన్న సుమారు రూ. 10,500 కోట్ల స్కాలర్‌షిప్, ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలను తక్షణమే విడుదల చేసి విద్యార్థుల భవిష్యత్తును కాపాడాలని భారత విద్యార్థి ఫెడరేషన్ (ఎస్ఎఫ్ఐ) డిమాండ్ చేసింది. ఎస్ఎఫ్ఐ చౌటుప్పల్ మండల కమిటీ ఆధ్వర్యంలో శనివారం స్థానిక శ్రీ చైతన్య పారామెడికల్ కళాశాలలో ప్రైవేట్ కళాశాల యాజమాన్యాలతో రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి ఎస్ఎఫ్ఐ మండల అధ్యక్షుడు దాసరి ప్రకాష్ అధ్యక్షత వహించారు.

**ఉన్నత విద్యకు ఆటంకాలు..**

ఈ సందర్భంగా ఎస్ఎఫ్ఐ మండల కార్యదర్శి తిగుళ్ళ శ్రీనివాస్ మాట్లాడుతూ.. రాష్ట్రంలో వేలాది మంది విద్యార్థులకు ప్రభుత్వం చెల్లించాల్సిన బకాయిలు విడుదల కాకపోవడం బాధాకరమన్నారు. దీనివల్ల ప్రైవేట్ కళాశాలలు తీవ్ర ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్నాయని, విద్యార్థులు సర్టిఫికెట్లు పొందడంలో, ఉన్నత విద్యను కొనసాగించడంలో ఇబ్బందులు పడుతున్నారని పేర్కొన్నారు. ప్రజాపాలన పేరుతో అధికారంలోకి వచ్చిన ప్రభుత్వం విద్యకు ప్రాధాన్యత ఇస్తామని హామీ ఇచ్చి, నిధులు విడుదల చేయడంలో విఫలమైందని విమర్శించారు. ప్రభుత్వం వెంటనే స్పందించకుంటే రాష్ట్రవ్యాప్తంగా ఆందోళనలు ఉధృతం చేస్తామని హెచ్చరించారు. ఈ పోరాటానికి ప్రైవేట్ యాజమాన్యాలు తమ సంపూర్ణ మద్దతు ప్రకటించాయి. సమావేశంలో శ్రీ చైతన్య పారామెడికల్ ప్రిన్సిపల్ శేఖర్ రెడ్డి, ప్రతిభ ఒకేషనల్ జూనియర్ కళాశాల ప్రిన్సిపల్ సిలువేరు శ్రీనివాస్, నలంద డిగ్రీ కళాశాల ప్రిన్సిపల్ కట్టెల లింగస్వామి, మాతృశ్రీ డిగ్రీ కళాశాల ప్రతినిధి మహేందర్ రెడ్డి, జేబీఎం ఒకేషనల్ జూనియర్ ప్రతినిధి జంగయ్య, శ్రీ గాయత్రి డిగ్రీ కళాశాల ప్రిన్సిపల్ ఆంజనేయులు, బీఈడీ కళాశాల ప్రిన్సిపల్ రాజశేఖర్, ఎస్ఎఫ్ఐ నాయకులు అరవింద్, మల్లేష్ తదితరులు పాల్గొన్నారు.

# మురిసిన చిన్నారులు.. వానల కోసం 'కప్పల పెళ్లి'





- ట్రినిటీ హైస్కూల్‌లో గులాబీ వర్ణ శోభితంగా పింక్ డే సంబరాలు
- అన్నదాతల ఇంట సిరులు నిండాలని కాంక్ష
- రంగుల ఆవశ్యకతను వివరించిన ప్రిన్సిపాల్ డాక్టర్ ఉజ్జిని మంజుల

**తొలివెలుగు, చౌటుప్పల్ పట్టణం :** చౌటుప్పల్ మున్సిపాలిటీ పరిధిలోని ట్రినిటీ హైస్కూల్‌లో పింక్ డే వేడుకలను శనివారం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి పాఠశాల ప్రిన్సిపాల్ కం డైరెక్టర్ డాక్టర్ ఉజ్జిని మంజుల ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆమె చిన్నారి విద్యార్థులకు గులాబీ (పింక్) రంగు యొక్క ఆవశ్యకతను వివరించారు. అలాగే ఇంద్రధనస్సు మాదిరిగా వివిధ రకాల రంగులను విద్యార్థులకు ప్రదర్శించి అవగాహన కల్పించారు.

**రైతులు సుభిక్షంగా ఉండాలి..**

రాష్ట్రంలో ప్రస్తుతం వర్షాలు కురవక కరువు పరిస్థితులు నెలకొన్న నేపథ్యంలో, సకాలంలో వర్షాలు కురవాలని కాంక్షిస్తూ విద్యార్థుల చేత సాంప్రదాయబద్ధంగా కప్పల పెళ్లి జరిపించారు. అనంతరం డాక్టర్ ఉజ్జిని మంజుల మాట్లాడుతూ.. రాష్ట్రంలో వర్షాలు సమృద్ధిగా కురిసి, రైతుల ఇంట సిరులు నిండాలని ఆశాభావం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో ట్రినిటీ హైస్కూల్ చైర్మన్ కె.వి.బి. కృష్ణారావు, ఉపాధ్యాయులు స్వప్న, షాను, ఉమారాణి, అనిత, వరలక్ష్మి, మీనాక్షి, మౌనిక, శ్రావణి, అనూష, శోభ తదితరులు పాల్గొన్నారు.



# స్వచ్ఛ పథంలో బోగారం..
# రహదారుల వెంట పారిశుధ్య సంబరం

- వివేకానంద విగ్రహం నుంచి పాత ఊరి దాకా క్లీన్ డ్రైవ్
- చెత్తను రోడ్లపై వేయొద్దు: సర్పంచ్ సాయికుమార్ గౌడ్ పిలుపు

**తొలివెలుగు,రామన్నపేట:** మండల పరిధిలోని బోగారం గ్రామంలో గ్రామపంచాయతీ ఆధ్వర్యంలో శనివారం విస్తృత శుభ్రత కార్యక్రమాన్ని నిర్వహించారు. బోగారం రోడ్డుపై ఉన్న స్వామి వివేకానంద విగ్రహం నుంచి పాత ఊరు వరకు రహదారికి ఇరువైపులా ఉన్న పిచ్చిమొక్కలను తొలగించి, గ్రామపంచాయతీ సిబ్బంది చీపుర్లతో రోడ్లను శుభ్రపరిచారు. పరిసరాలు అపరిశుభ్రంగా మారకుండా ప్రత్యేక చర్యలు చేపట్టారు. ఈ సందర్భంగా గ్రామ సర్పంచ్ కూనూరు సాయికుమార్ గౌడ్ మాట్లాడుతూ.. గ్రామాన్ని ఎల్లప్పుడూ పరిశుభ్రంగా ఉంచుకోవడం ప్రతి ఒక్కరి కనీస బాధ్యత అని పేర్కొన్నారు. ప్రజలు తమ ఇళ్లతో పాటు పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలని, చెత్తను ఎక్కడపడితే అక్కడ వేయకుండా పరిశుభ్రత పాలనకు సహకరించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో 5వ వార్డు సభ్యురాలు నేరటి మానస సురేష్ యాదవ్, గ్రామపంచాయతీ కార్యదర్శి అక్కెనపల్లి సుధా, పంచాయతీ సిబ్బంది, గ్రామస్థులు పాల్గొన్నారు.

# బస్సులో ప్రయాణిస్తూ వ్యక్తి గుండెపోటుతో మృతి

- హైదరాబాద్ నుంచి వెళ్తుండగా లక్కారం వద్ద విషాదం
- కృష్ణా జిల్లా నిడమనూరుకు చెందిన పటాన్ ఖాదర్బాషా
- చౌటుప్పల్ పోలీసుల కేసు నమోదు

**తొలివెలుగు, చౌటుప్పల్ :** బస్సులో ప్రయాణిస్తున్న ఓ వ్యక్తి గుండెపోటుతో హఠాన్మరణం చెందినట్లు చౌటుప్పల్ పోలీస్ ఇన్‌స్పెక్టర్ జి. మన్మథ కుమార్ తెలిపారు. పోలీసుల కథనం ప్రకారం... ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం కృష్ణా జిల్లా నిడమనూరు గ్రామానికి చెందిన పటాన్ ఖాదర్బాషా (41) గత ఎనిమిది నెలలుగా ఒక మ్యారేజ్ బ్యూరోలో పని చేస్తున్నాడు. ఈ నెల 16న హైదరాబాద్‌లోని మ్యారేజ్ బ్యూరో కార్యాలయానికి ఐడీ కార్డులు తెచ్చుకోవడానికి వెళ్లాడు. పని ముగించుకుని తిరిగి ఈ నెల 17న హైదరాబాద్ నుండి నిడమనూరుకు బస్సు (ఎన్ఎల్ 01బీ 3521) లో బయలుదేరాడు. మార్గమధ్యంలో శనివారం తెల్లవారుజామున సుమారు 01:40 గంటల సమయంలో చౌటుప్పల్ మండల పరిధిలోని లక్కారం వద్దకు రాగానే ఖాదర్బాషాకు ఛాతిలో తీవ్రమైన నొప్పి వచ్చి స్పృహ కోల్పోయాడు. తోటి ప్రయాణికులు వెంటనే అంబులెన్స్‌కు సమాచారం అందించారు. ఘటనా స్థలానికి చేరుకున్న వైద్య సిబ్బంది అతడు అప్పటికే మృతి చెందినట్లు నిర్ధారించారు. అనంతరం మృతదేహాన్ని చౌటుప్పల్ ప్రభుత్వ ఆసుపత్రి మార్చురీ గదికి తరలించారు. మృతుడి భార్య పఠాన్ మహిరుణ్ణిశ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ మన్మథ కుమార్ తెలిపారు.




# చట్టాలపై ప్రతి ఒక్కరూ అవగాహన కలిగి ఉండాలి

- దుబ్బాక జడ్పీ పాఠశాలలో న్యాయ విజ్ఞాన సదస్సు
- హాజరైన అదనపు జూనియర్ సివిల్ జడ్జి వి. రత్నకుమారి

**తొలివెలుగు, రామన్నపేట :** సమాజంలో ప్రతి ఒక్కరూ చట్టాలపై కనీస అవగాహన కలిగి ఉండాలని రామన్నపేట అదనపు జూనియర్ సివిల్ జడ్జి వి. రత్నకుమారి అన్నారు. మండల పరిధిలోని దుబ్బాక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో రామన్నపేట మండల న్యాయ సేవ అధికార సంస్థ ఆధ్వర్యంలో శనివారం విద్యార్థులకు న్యాయ విజ్ఞాన సదస్సు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి బార్ అసోసియేషన్ అధ్యక్షుడు ఎం.ఏ. మజీద్‌తో కలిసి ఆమె ముఖ్య అతిథిగా హాజరయ్యారు.

**హక్కులు, బాధ్యతలు తెలుసుకోవాలి:**

ఈ సందర్భంగా జడ్జి వి. రత్నకుమారి మాట్లాడుతూ.. విద్యార్థులు చదువుతో పాటు దేశంలోని చట్టాల పట్ల జ్ఞానాన్ని పెంపొందించుకోవాలని సూచించారు. విద్యా హక్కు, బాలకార్మిక నిరోధక, బాల్య వివాహాల నిషేధ, పోక్సో, కార్మిక, మాదక ద్రవ్యాల నియంత్రణ చట్టాలపై అవగాహన కలిగి ఉండటం అవసరమని పేర్కొన్నారు. పాఠశాలలో గానీ, మార్గమధ్యంలో గానీ ఆకతాయిల వల్ల సమస్యలు ఎదురైతే అధైర్యపడకుండా చైల్డ్ ప్రొటెక్షన్ ఆఫీసర్ లేదా సమీప పోలీస్ స్టేషన్‌ను సంప్రదించాలన్నారు. ఈ కార్యక్రమంలో న్యాయవాదులు మామిడి వెంకట్ రెడ్డి, పాల్వంచ జగతయ్య, కూనూరు శ్రీనివాస్, యాదాసు యాదయ్య, ప్రధానోపాధ్యాయురాలు భవానీ, చైల్డ్ ప్రొటెక్షన్ ఆఫీసర్ జె. అరుణ కుమారి, కానుగంటి శ్రీశైలం, కోర్టు, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.






# వృద్ధాశ్రమంలో ఎమ్మెల్యే జగదీష్ రెడ్డి జన్మదిన వేడుకలు

- ఆశ్రయవాసులకు అన్నదానం, స్వీట్ల పంపిణీ
- వృద్ధులను ఆదరించడం ప్రతి ఒక్కరి సామాజిక బాధ్యత: ప్రభాకర్ రెడ్డి

**తొలివెలుగు, సూర్యాపేట:** సూర్యాపేట ఎమ్మెల్యే, మాజీ మంత్రి గుంతకండ్ల జగదీష్ రెడ్డి జన్మదిన వేడుకలను శనివారం జిల్లా కేంద్రం పరిధిలోని దురాజ్‌పల్లి సమీపంలోని వివేకానంద వృద్ధాశ్రమంలో బీఆర్ఎస్ శ్రేణులు సేవా కార్యక్రమాల మధ్య ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా నాలుగో వార్డు కౌన్సిలర్ భూక్య జ్యోతి లింగ నాయక్ ఆధ్వర్యంలో వృద్ధుల సమక్షంలో కేక్ కట్ చేసి స్వీట్లు పంపిణీ చేశారు. అనంతరం ఎమ్మెల్యే జగదీష్ రెడ్డి వ్యక్తిగత కార్యదర్శి ప్రభాకర్ రెడ్డి ఆశ్రయవాసులకు అన్నదాన కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ప్రభాకర్ రెడ్డి మాట్లాడుతూ.. సమాజంలో వృద్ధుల పట్ల ప్రతి ఒక్కరూ మానవతా దృక్పథంతో వ్యవహరించాలని అన్నారు. వృద్ధులను ఆదరించడం, వారికి చేయూతనివ్వడం ప్రతి ఒక్కరి సామాజిక బాధ్యత అని పేర్కొన్నారు. ఇలాంటి సేవా కార్యక్రమాలు సమాజానికి ఆదర్శంగా నిలుస్తాయని చెప్పారు. తమ మధ్యకు వచ్చి జన్మదిన వేడుకలను నిర్వహించడం పట్ల వృద్ధాశ్రమంలోని ఆశ్రయవాసులు ఆనందం వ్యక్తం చేశారు. ఎమ్మెల్యే జగదీష్ రెడ్డి నిండు నూరేళ్లు ఆయురారోగ్యాలతో జీవించాలని భగవంతుడిని ప్రార్థిస్తూ ఆయనకు ఆశీస్సులు అందజేశారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు భాషా భాయ్, బత్తుల రమేష్, సవరాల సత్యనారాయణ, జీడి బిక్షం, బూర బాలసైదులు గౌడ్, నెమ్మది బిక్షం, నరేష్ తదితరులు పాల్గొని వృద్ధులకు భోజనాలు వడ్డించారు.

# అనాథాశ్రమంలో చిన్నారి పుట్టినరోజు వేడుకలు

- వృద్ధులకు అన్నదానం చేసిన సామ నరేందర్ రెడ్డి దంపతులు
- రేణుక ఎల్లమ్మ ఆలయంలో ప్రత్యేక పూజలు



**తొలివెలుగు, ఆత్మకూరు (ఎం) :** మండల పరిధిలోని పల్లెర్ల గ్రామ పంచాయతీ పాలకవర్గ సభ్యుడు, బీఆర్ఎస్ గ్రామశాఖ అధ్యక్షుడు సామ నరేందర్ రెడ్డి-విద్య దంపతుల కుమార్తె ఈశాని రెడ్డి జన్మదిన వేడుకలను శనివారం సేవా కార్యక్రమాల నడుమ వినూత్నంగా నిర్వహించారు. ఈ సందర్భంగా కుటుంబ సభ్యులతో కలిసి భువనగిరిలోని రేణుక ఎల్లమ్మ తల్లి దేవస్థానాన్ని సందర్శించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అమ్మవారి ఆశీస్సులు పొందిన అనంతరం రాయగిరి గ్రామ పరిధిలోని 'సహృదయ' అనాథ ఆశ్రమంకు వెళ్లి అక్కడ ఆశ్రయం పొందుతున్న వృద్ధులకు అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆశ్రమ నిర్వాహకులు, వృద్ధులు చిన్నారి ఈశాని రెడ్డికి జన్మదిన శుభాకాంక్షలు తెలియజేస్తూ, ఆయురారోగ్యాలతో సుఖసంతోషాలతో వర్ధిల్లాలని ఆశీర్వదించారు. ఈ కార్యక్రమంలో సామ నరేందర్ రెడ్డి కుటుంబ సభ్యులు, బంధువులు, సన్నిహితులు పాల్గొన్నారు.

# జిల్లా స్థాయి త్రోబాల్ విజేతగా 'రాణి రుద్రమదేవి' జట్టు

- ఈషా ఫౌండేషన్ గ్రామోత్సవ్ క్రీడల్లో ఆత్మకూరు మహిళల సత్తా
- ఫైనల్లో కోటమర్తి జట్టుపై ఘన విజయం

**తొలివెలుగు, ఆత్మకూరు (ఎం) :** యాదాద్రి భువనగిరి జిల్లా కేంద్రంలోని జూనియర్ కళాశాల మైదానంలో ఈషా ఫౌండేషన్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న గ్రామోత్సవ్ క్రీడోత్సవాల్లో ఆత్మకూరు (ఎం) మండలానికి చెందిన 'రాణి రుద్రమదేవి' మహిళల త్రోబాల్ జట్టు జిల్లా విజేతగా నిలిచింది. శనివారం జరిగిన మహిళల త్రోబాల్ ఫైనల్ పోటీలో కోటమర్తి జట్టుతో తలపడిన రాణి రుద్రమదేవి జట్టు ఆద్యంతం అద్భుత ఆటతీరును ప్రదర్శించి ఘన విజయం సాధించి టైటిల్‌ను కైవసం చేసుకుంది. టోర్నమెంట్ మొత్తం అత్యుత్తమ ప్రతిభ కనబరిచిన ఆత్మకూరు మహిళల జట్టు ఫైనల్‌లోనూ సమష్టి కృషితో ఆకట్టుకుని జిల్లా ఛాంపియన్‌గా నిలవడంతో క్రీడాభిమానులు హర్షం వ్యక్తం చేశారు. జిల్లా విజేతలుగా నిలిచిన జట్టు సభ్యులు రచ్చ పల్లవి, మల్లం శ్రీలత, తవిటి హేమలత, ఆశ మమత, బొడ్డు సరిత, రాచమల్ల హర్షిత, మోలుగురి లక్ష్మీ ప్రహర్షిత, మోలుగురి మయూరిలను క్రీడా నిర్వాహకులు, పలువురు ప్రముఖులు అభినందించి శుభాకాంక్షలు తెలిపారు.







# వైద్యం అందేనా?.. పల్లె దవాఖానలో మందుబాబుల హంగామా

- వెల్లంకి పల్లె దవాఖానను వెంటనే ప్రారంభించాలి: సీపీఎం
- మద్యపాన నిషేధంపై గ్రామ పంచాయతీ తీర్మానం చేయాలని వినతి

**తొలివెలుగు, రామన్నపేట :** ప్రజలకు మెరుగైన ఉచిత వైద్య సేవలు అందించాలనే ఉద్దేశంతో నిర్మించిన వెల్లంకి పల్లె దవాఖాన భవనం ప్రారంభానికి నోచుకోకపోవడంతో మందుబాబుల అడ్డాగా మారిందని సీపీఎం నాయకులు ఆందోళన వ్యక్తం చేశారు. శనివారం సీపీఎం జిల్లా కమిటీ సభ్యుడు వనం ఉపేందర్, మాజీ సర్పంచ్ కూరెళ్ల నర్సింహాచారి గ్రామంలోని పాత ఉపకేంద్రంతో పాటు నూతన పల్లె దవాఖాన భవనాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. అధికారుల నిర్లక్ష్యంతో దవాఖాన భవనం ఉపయోగం లేకుండా ఉండిపోవడంతో ఆకతాయిలు లోపలికి చొరబడి కిటికీల అద్దాలు, తలుపులు ధ్వంసం చేస్తున్నారని, మద్యం సీసాలతో భవనాన్ని అపవిత్రం చేస్తున్నారని ఆరోపించారు. ప్రజల ఆరోగ్యాన్ని దృష్టిలో ఉంచుకుని వెంటనే పల్లె దవాఖానను ప్రారంభించి, భవనానికి రోడ్డు సౌకర్యం కల్పించడంతో పాటు రెగ్యులర్ వైద్యుడిని నియమించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.

**మద్యంతో చితికిపోతున్న కుటుంబాలు:**

గ్రామంలో విచ్చలవిడిగా పెరుగుతున్న మద్యపానం కారణంగా అనేక పేద కుటుంబాలు ఆర్థిక, సామాజికంగా తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నాయని సీపీఎం నాయకులు ఆవేదన వ్యక్తం చేశారు. గ్రామంలో సంపూర్ణ మద్యపాన నిషేధం అమలు చేసేలా గ్రామ పంచాయతీ ప్రత్యేక తీర్మానం చేయాలని కోరుతూ సర్పంచ్ ఈడెం రాధ శ్రీనివాస్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో సీపీఎం మండల నాయకుడు ఆవనగంటి నగేష్, మాజీ ఎంపీటీసీలు బర్ల బాబురావు, ఎర్రోళ్ల లక్ష్మమ్మ, వార్డు సభ్యులు కన్నెబోయిన రాజలింగం, తాటిపాముల వినీత, ఆవనగంటి వెంకటమ్మ, నాయకులు స్వామి, సంతోష్, చెన్ను స్వామి తదితరులు పాల్గొన్నారు.



# నేడే ఫిఫా ప్రపంచ కప్ ఫైనల్.

## అర్జెంటీనాతో స్పెయిన్ ఢీ!

48 జట్లతో మొదలై.. 38 రోజులుగా యావత్ ప్రపంచాన్ని ఉర్రూతలూగించిన 103 హోరాహోరీ పోరాటాల తర్వాత సాకర్ ప్రపంచకప్ కథ క్లైమాక్స్‌కు చేరింది. క్రీడా జగత్తులోనే అత్యుత్తమైన ఫుట్‌బాల్ సింహాసనాన్ని అధిరోహించే అత్యున్నత దేశం ఏదో తేల్చే మహా సంగ్రామానికి సర్వం సిద్ధమైంది. ఒకవైపు మైదానంలో నిప్పులు చెరిగే అర్జెంటీనా ఆవేశం.. మరోవైపు ప్రత్యర్థిని ఉక్కిరిబిక్కిరి చేసే స్పెయిన్ వ్యూహాత్మక ఆటకు మధ్య న్యూజెర్సీ గడ్డపై అభిమానులకు అల్టిమేట్ కిక్ ఇచ్చే 'ఫైనల్ వార్' జరగనుంది. 39 ఏండ్ల వయసులో మరోసారి విశ్వవిజేతగా నిలవాలని కసిగా ఉన్న లియోనెల్ మెస్సీ ఆఖరి ప్రయత్నం.. బాల్యంలో అతడి చేతుల్లోనే ఒదిగిపోయి నేడు అదే దిగ్గజానికే సవాల్ విసురుతున్న స్పెయిన్ నయా సంచలనం లామిన్ యమాల్ ప్రతిఘటన.. ఈ ఫైనల్ పోరులో ప్రధాన ఆకర్షణగా మారాయి. మైదానం వెలుపల గురుశిష్యులైన ఇరు జట్ల కోచ్‌ల వ్యూహ ప్రతివ్యూహాల నడుమ జరగబోయే ఈ సాకర్ కురుక్షేత్రంలో గెలిచి.. ప్రపంచ కిరీటాన్ని కైవసం చేసుకునే అజేయ శక్తి ఏదో మరికొద్ది గంటల్లో తేలనుంది!

న్యూయార్క్: సాకర్ ప్రపంచంలోనే అత్యున్నత సమరానికి వేళయింది. భారత కాలమానం ప్రకారం ఆదివారం అర్ధరాత్రి న్యూజెర్సీలోని మెట్‌లైఫ్ స్టేడియం వేదికగా జరగబోయే ఫిఫా ప్రపంచకప్ ఫైనల్ మ్యాచ్‌లో డిఫెండింగ్ చాంపియన్ అర్జెంటీనా, యూరోపియన్ కింగ్ స్పెయిన్‌తో తలపడనుంది. మెస్సీ మ్యాజిక్‌తో వరుసగా రెండోసారి ట్రోఫీని ముద్దాడాలని అర్జెంటీనా పట్టుదలగా ఉంటే, 2010 తర్వాత తొలిసారి ఫైనల్ చేరిన స్పెయిన్ ఎలాగైనా విశ్వవిజేతగా నిలవాలని ఆశిస్తోంది. డిఫెండింగ్ చాంపియన్‌గా బరిలోకి దిగిన అర్జెంటీనా జట్టులో 2022 టైటిల్ గెలిచిన 17 మంది ఆటగాళ్లు ఉన్నారు. అయితే ఈ టోర్నీలో అర్జెంటీనా ప్రయాణం అంత సులువుగా సాగలేదు. గ్రూప్ దశను అలవోకగా దాటినప్పటికీ నాకౌట్‌లో ప్రతీ మ్యాచ్‌లో కఠిన సవాల్‌ను ఎదుర్కొంది. అరంగేట్రం జట్టు కాబో వెర్డెపై ఎక్స్‌ట్రా టైమ్‌లో నెగ్గిన మెస్సీసేన ఈజిప్ట్, స్విట్జర్లాండ్, ఇంగ్లండ్‌పై కష్టపడి గెలిచి ఫైనల్ చేరింది. అయితే తీవ్ర ఒత్తిడిలో, ఓటమి అంచున నిలిచిన సమయాల్లో ఏమాత్రం వెనక్కుతగ్గకపోవడం.. అఖరి క్షణాల్లో వరుస గోల్స్ చేయడం అర్జెంటీనా అతిపెద్ద బలంగా మారింది. 39 ఏండ్ల వయసులోనూ మెస్సీ తన అద్భుతమైన గోల్స్, అసిస్ట్‌లతో జట్టును ముందుండి నడిపిస్తున్నాడు. టోర్నీలో ఇప్పటికే హ్యాట్రిక్ సహా 8 గోల్స్ కొట్టి కప్పుతో పాటు గోల్డెన్ బూట్ రేసులోనూ ముందున్నాడు. తన చివరి ప్రపంచకప్ మ్యాచ్‌ను ఒక అద్భుత విజయంతో ముగించాలని అతను పట్టుదలతో ఉన్నాడు. ఆఖరాటలో మెస్సీపై అర్జెంటీనా భారీ అంచనాలు పెట్టుకుంది. అతనికితోడు సెమీస్‌లో అద్భుత గోల్స్ కొట్టిన ఎంజో ఫెర్నాండెజ్, లూటరో మార్టినెజ్ ఫామ్‌లో ఉండటం ఆ జట్టుకు కలిసొచ్చే అంశం.

**అజేయ శక్తి స్పెయిన్**

స్పెయిన్ ప్రస్తుతం ఓటమెరుగని పవర్‌హౌస్‌లా దూసుకెళ్తోంది. వరుసగా 37 మ్యాచ్‌ల్లో అజేయంగా నిలిచిన స్పెయిన్.. ఈ మ్యాచ్‌లో గెలిస్తే 2010 తర్వాత రెండో ప్రపంచకప్‌ను కైవసం చేసుకోవడమే కాకుండా, గతంలో 38 మ్యాచ్‌లతో ఇటలీ (2018-2021) నెలకొల్పిన అంతర్జాతీయ అజేయ రికార్డును బద్దలు కొడుతుంది. గ్రూప్ దశలో కాబో వెర్డెతో తొలి పోరును డ్రా చేసుకున్న తర్వాత రోడ్రి కెప్టెన్సీలోని స్పెయిన్ అసాధారణ ఆటతీరును చూపెడుతూ వరుసగా ఆరు మ్యాచ్‌ల్లో ఏకపక్ష విజయాలు అందుకుంది. సెమీఫైనల్లో ఫ్రాన్స్‌ను ఉక్కిరిబిక్కిరి చేసిన రోడ్రిసేన ఒత్తిడిని చిరునవ్వుతో ఎదుర్కొంటూ ఫేవరెట్‌గా నిలిచింది. ఫ్యూయెంటె మార్గదర్శకత్వంలో ఆడుతున్న ఈ జట్టు బంతిని తమ ఆధీనంలో ఉంచుకుంటూ ప్రత్యర్థులకు కోలుకునే అవకాశం ఇవ్వడం లేదు. ఈ టోర్నీలో ఏడు మ్యాచ్‌ల్లో ఒక్క గోల్ కూడా ఇవ్వలేదంటే ఆ జట్టు డిఫెన్స్ ఎంత బలంగా ఉందో చెప్పొచ్చు. దాంతో అర్జెంటీనా ఫార్వర్డ్స్‌కు స్పెయిన్ డిఫెండర్లకు మధ్య రసవత్తర పోరు అభిమానులను అలరించడం పక్కా అనొచ్చు.

**చరిత్ర ఏం చెబుతున్నది?**

ప్రపంచకప్‌లో ఇరు జట్లు 1966లో ఒకేసారి తలపడగా.. అర్జెంటీనా 2-1తో గెలిచింది. అయితే మొత్తంగా ఆడిన 13 ఫ్రెండ్లీ మ్యాచ్‌ల్లో స్పెయిన్ 6, అర్జెంటీనా 5 మ్యాచ్‌ల్లో గెలిచాయి, రెండు డ్రా అయ్యాయి. 2018లో జరిగిన చివరి పోరులో స్పెయిన్ 6-1తో అర్జెంటీనాను చిత్తు చేసింది.

ఫైనల్ మ్యాచ్ ప్రారంభానికి గంటన్నర ముందు వరల్డ్ స్టార్లతో కూడిన క్లోజింగ్ సెర్మనీ జరగనుంది. ప్రముఖ రాప్ స్టార్ పోస్ట్ మలోన్, రాబీ విలియమ్స్, ప్రముఖ స్ట్రీమర్ ఐషోస్పీడ అభిమానులను ఉర్రూతలూగించనున్నారు. ఫైనల్ చరిత్రలోనే తొలిసారిగా హాఫ్-టైమ్ షోను ప్రవేశపెడుతున్నారు. మ్యాచ్ విరామ సమయంలో ఫుట్‌బాల్, సంగీతం కలబోతగా సాగే ప్రదర్శనలో పాప్ సింగర్స్ జస్టిన్ బీబర్, మడోన్నా, షకీరాతో పాటు సౌత్ కొరియా మ్యూజిక్ సెన్సేషన్ బీటీఎస్ స్టేజ్‌పై సందడి చేయనున్నారు. అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్, ఫిఫా ప్రెసిడెంట్ ఇన్‌ఫాంటినోతో కలిసి విజేతకు ట్రోఫీని అందజేస్తారు.

ఫైనల్ పోరు కోసం అడిడాస్ సంస్థ ప్రత్యేకంగా రూపొందించిన 'ట్రియోండా ఫైనల్' బంతిని ఉపయోగిస్తారు. బంగారం, నలుపు, తెలుపు రంగుల కలయికతో ఆకర్షణీయమైన డిజైన్‌తో రూపొందించిన ఈ బంతి, ఈ టోర్నీ జరిగిన 16 ఆతిథ్య నగరాల ప్రయాణాన్ని ప్రతిబింబిస్తుంది. ఈ మ్యాచ్‌లో అందరి దృష్టి బార్సిలోనాకు చెందిన 'లా మాసియా' అకాడమీ పుత్రులైన లియోనెల్ మెస్సీ, యువ సంచలనం లామిన్ యమాల్‌పైనే ఉంది. ఒకప్పుడు మెస్సీ బార్సిలోనాలో ఆడుతున్న రోజుల్లో పసిపాపగా ఉన్న యమాల్‌ను స్నానం చేయిస్తున్న ఫోటో సామాజిక మాధ్యమాల్లో వైరల్ అయింది. ఇప్పుడు అదే యమాల్ తన ఆరాధ్య దైవమైన మెస్సీని వరల్డ్ కప్ ఫైనల్లో ఢీకొంటున్నాడు. మరోవైపు అర్జెంటీనా కోచ్ లియోనెల్ స్కలోని.. ప్రస్తుత స్పెయిన్ కోచ్ లూయిస్ డి లా ఫ్యూయెంటె దగ్గరే విద్యార్థిగా శిక్షణ పొందాడు. ఇప్పుడు ఆ గురువు, శిష్యుడే ప్రపంచకప్ ట్రోఫీ కోసం వ్యూహాలు ప్రతివ్యూహాలతో తలపడనున్నారు. ఫైనల్ మ్యాచ్‌ను న్యూజెర్సీవాతావరణం, మెట్‌లైఫ్ స్టేడియం పిచ్ పరిస్థితులు కూడా శాసించే అవకాశం ఉంది. ఇక్కడి పిచ్ నాణ్యత బంతిని ఆధీనంలో ఉంచుకుని ఆడే స్పెయిన్ శైలికి ఇబ్బందిగా మారే ప్రమాదం ఉంది. ఇది అర్జెంటీనాకు కలిసిరావచ్చు. ఆదివారం 30 డిగ్రీల సెల్సియస్ ఉష్ణోగ్రతతో కూడిన వేడి, ఉక్కపోత ఉండనుంది. కెనడా అడవుల మంటల వల్ల ఏర్పడిన ప్రమాదకరమైన పొగ ఈ ప్రాంతాన్ని కమ్మేయడం 80 వేల మందికి పైగా వచ్చే అభిమానులతో పాటు ఆటగాళ్లలోనూ ఆందోళన కలిగిస్తోంది. .




# పుస్తకాలతో స్నేహం చేయండి.. బాధ్యతగల పౌరులుగా ఎదగండి

- జనంపల్లి జెడ్పీహెచ్‌ఎస్‌లో న్యాయ చైతన్య సదస్సు
- ఆకతాయిల వేధింపులపై భయపడొద్దు: జడ్జి ఎస్. శిరీష భరోసా

**తొలివెలుగు, రామన్నపేట :** విద్యార్థులు విద్యాభ్యాసంతో పాటు దేశంలోని చట్టాలపై కనీస అవగాహన పెంపొందించుకోవాలని రామన్నపేట ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి ఎస్. శిరీష సూచించారు. రామన్నపేట మండల న్యాయ సేవల అధికార సంస్థ ఆధ్వర్యంలో శనివారం జనంపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు ప్రత్యేక న్యాయ అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి న్యాయవాదులు బర్ల డేవిడ్, మామిడి వెంకట్ రెడ్డి, ఎన్. రమేష్‌లతో కలిసి ఆమె ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా జడ్జి ఎస్. శిరీష మాట్లాడుతూ.. విద్య ద్వారానే సమాజంలో గొప్ప మార్పులు సాధ్యమవుతాయని, విద్యార్థులు అన్ని రంగాల్లో రాణించేందుకు నిరంతరం కృషి చేయాలని పిలుపునిచ్చారు. విద్యా హక్కు చట్టం, బాలకార్మిక నిరోధక చట్టం, బాల్య వివాహాల నిషేధ చట్టం, పోక్సో చట్టం, మాదక ద్రవ్యాల నియంత్రణ వంటి అంశాలపై ప్రతి ఒక్కరూ అవగాహన కలిగి ఉండాలన్నారు. పాఠశాలలో గానీ, మార్గమధ్యంలో గానీ ఎలాంటి ఇబ్బందులు ఎదురైనా అధైర్యపడకుండా చైల్డ్ ప్రొటెక్షన్ ఆఫీసర్ లేదా సమీప పోలీస్ స్టేషన్, న్యాయ సేవల సంస్థను సంప్రదించి పరిష్కారం కోరాలని స్పష్టం చేశారు. చెడు అలవాట్లకు దూరంగా ఉండి పుస్తక పఠనంపై శ్రద్ధ పెట్టాలని హితవు పలికారు. ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయురాలు కె. విజయ మాధవి, చైల్డ్ ప్రొటెక్షన్ ఆఫీసర్ మట్టారెడ్డి, అధ్యాపక బృందం, కోర్టు, పోలీసు సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

# నిధానపల్లిలో భూముల రీ-సర్వే

- పారదర్శకంగా భూ రికార్డుల రూపకల్పన
- రైతులు సహకరించాలని సర్పంచ్ నారాపాక మాధవి విజ్ఞప్తి



**తొలివెలుగు, రామన్నపేట :** మండల పరిధిలోని నిధానపల్లి గ్రామంలో ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన భూముల రీ-సర్వే కార్యక్రమాన్ని శనివారం ప్రారంభించారు. మండల తహసీల్దార్ లాల్ బహదూర్ ఆధ్వర్యంలో ఈ ప్రక్రియను పర్యవేక్షించారు. ఈ సందర్భంగా గ్రామ సర్పంచ్ నారాపాక మాధవి యాదయ్య మాట్లాడుతూ.. ఆధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని వినియోగించి భూముల సరిహద్దులను ఖచ్చితంగా నిర్ధారించడం, భూ రికార్డులను పారదర్శకంగా రూపొందించడమే ఈ రీ-సర్వే ప్రధాన ఉద్దేశమని వివరించారు.

**వివాదాల నివారణకే రీ-సర్వే:**

ఈ రీ-సర్వే ప్రక్రియ విజయవంతంగా పూర్తయితే గ్రామంలో దీర్ఘకాలంగా ఉన్న భూ వివాదాలు తగ్గడంతో పాటు ప్రతి భూ యజమానికి స్పష్టమైన హక్కుల నమోదు జరుగుతుందని సర్పంచ్ పేర్కొన్నారు. రైతులు, భూ యజమానులు తమ పట్టాదారు పాస్‌బుక్, ఆధార్ కార్డు తదితర భూ పత్రాలతో సర్వే బృందానికి క్షేత్రస్థాయిలో సహకరించాలని సూచించారు. సర్వే అనంతరం ఏవైనా అభ్యంతరాలు లేదా సవరణలు అవసరమైతే నిర్ణీత గడువులోగా సంబంధిత అధికారులకు దరఖాస్తు చేసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో రెవెన్యూ సిబ్బంది శోభ, వెంకటేశ్వర్లు, స్వప్న, లక్ష్మీదేవి, కాంగ్రెస్ పార్టీ జిల్లా నాయకులు గుత్తా నర్సిరెడ్డి, సింగిరెడ్డి మల్లారెడ్డి, ఉపసర్పంచ్ కొండ అండాలు మల్లయ్య, వార్డు సభ్యులు బాషమల్ల అనిత, సంతోష్, వంగాల పూజిత, ఏకుల మల్లేష్, పోలీసు సిబ్బంది, గ్రామస్థులు పాల్గొన్నారు.

# చలో కలెక్టరేట్ ఉద్రిక్తం

కొత్తూరు, జూలై 18 : ప్రసిద్ధ పుణ్యక్షేత్రం జేపీ దర్గాను రక్షించాలంటే మండలంలోని సిద్ధాపూర్‌లో డంపింగ్ యార్డు ఏర్పాటు జీవోను వెంటనే వెనక్కి తీసుకోవాలని శనివారం డంపింగ్ యార్డు వ్యతిరేక జేఏసీ చేపట్టిన చలో కలెక్టరేట్ ఉద్రిక్తంగా మారింది. సిద్ధాపూర్‌లో డంపింగ్ యార్డు ఏర్పాటు కోసం సర్కార్ తీసుకొచ్చిన 641 జీవోను వెనక్కి తీసుకోవాలని కోరుతూ రైతులు, నాయకులు చేపట్టిన చలో కలెక్టరేట్‌ను పోలీసులు ఎక్కడికక్కడ అడ్డుకున్నారు. ఉదయం నుంచే పలువురు నాయకులను అరెస్టు చేసి కొత్తూరు ఠాణాకు తరలించారు. అయినా ప్రజలు స్వచ్ఛందంగా జేపీ దర్గాకు తరలివచ్చి సీఎం రేవంత్‌రెడ్డి, ఎమ్మెల్యే శంకర్‌కు వ్యతిరేకంగా నినాదాలు చేస్తూ కలెక్టరేట్‌కు తరలివెళ్లారు. డీసీపీ శిరీష ఆధ్వర్యంలో పోలీసులు ఆందోళనకారులను ఎక్కడికక్కడ నిలువరించారు. కార్యక్రమంలో జేఏసీ అధ్యక్షుడు ప్రభాకర్, శేఖర్‌రెడ్డి, జగన్, దేవేందర్, నవీన్‌చారి, శ్యాంసుందర్‌రెడ్డి, సురేశ్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.